
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు ఆయుర్వేదంతో వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :80 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు గురువారం 30 జూలై 2026 పేజీలు :12 వేల రూ5 /-




## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది: కవిత

సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదన్న కవిత

టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న

ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు.సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.

## 'సర్' ప్రక్రియను వేగవంతం చేయాలి

### భట్టి విక్రమార్క



**ఢిల్లీ, జులై :** ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్‌ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్‌ఏలు( బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుంది: మహేశ్ కుమార్ గౌడ్**

'సర్'పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్‌ఏ లను నియమించినట్లు చెప్పారు. 50 నుంచి 60 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో వందశాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి 'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని - మిగతా3లో

## తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట



**హైదరాబాద్, జులై 29:** తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం(ఓఎం)ను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే - మిగతా3లో

## బంగాళాఖాతంలో మునిగిన వాళ్లే హైడ్రాను ముంచుతామంటారా?'..

### కేటీఆర్‌పై తుమ్మల సెటైర్



**హైదరాబాద్, జులై 29:** హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి - మిగతా3లో

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**ఇంటర్నెట్ డెస్క్:** పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను తిరస్కరించింది. పశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ సమావేశాలను స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా - మిగతా3లో

## అడవులను కాపాడుకుందాం

### వన్యప్రాణులను సంరక్షిద్దం

### మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్:** పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. ఈ రోజు అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు.ఈ కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్



ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో - మిగతా3లో

## విద్యార్థుల భవిష్యత్తుకు రక్షణ..

### లోక్‌సభ ఆమోదంతో పేపర్ లీక్‌లకు చెక్: కేంద్ర మంత్రి అమిత్ షా



**ఇంటర్నెట్ డెస్క్:** దేశంలోని లక్షలాది మంది పరీక్షార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం ద్వారా పోటీ పరీక్షల్లో పారదర్శకత పెరుగుతుందని, పేపర్ లీకేజీలు, నకిలీ పరీక్షలు, ఇతర అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ఆయన పేర్కొన్నారు. నిజాయతీగా శ్రమించే విద్యార్థుల భవిష్యత్తును రక్షించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని - మిగతా3లో

## విద్యార్థులపై కాల్పులు జరిపించింది హోంమంత్రి

### ఆర్ఎస్ఎస్ చేతిలో విద్యావ్యవస్థ" లోక్‌సభలో రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, జూలై 29:** పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు, 2026పై జరిగిన చర్చ సందర్భంగా, లోక్‌సభలో హాట్ హాట్ చర్చ జరిగింది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. హోంమంత్రి అమిత్‌షా, ఆర్ఎస్ఎస్‌పై చేసిన కామెంట్స్‌ను అధికార పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయన క్షమాపణలు చెప్పి వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. దీంతో ఇరు వర్గాల పోటాపోటీ నినాదాలతో సభలో గందరగోళం ఏర్పడింది. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, " కేంద్ర హోం మంత్రి అని పిలిచే ఆయనకు ఇక్కడకు వచ్చి కూర్చునే ధైర్యం లేదు. నేను ఆయన వాహనశ్రేణిని చూశాను. అందులో 30 వాహనాలు ఉన్నాయి. కానీ హోం మంత్రి భయపడుతున్నారు, అందుకే ఆయన ఈరోజు ఇక్కడ లేరు. పిల్లలపై పెల్లెట్లు ప్రయోగించారు. పిల్లలకు షాక్ ఇవ్వాలని ఆయన (హోం మంత్రి



అమిత్ షా) ఆదేశించారు."రాహుల్ ప్రసంగాన్ని కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. "రాహుల్ - మిగతా3లో

## హైడ్రాపై వారే నిర్ణయం

### మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ, జులై 29 :** హైడ్రాపై తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ) కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైడ్రాపై ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయనే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

**ఈనెల 31న ఎన్డీఎస్ఏ సమావేశం**

కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని



తెలిపారు. ఈరోజు (బుధవారం) ఢిల్లీ వేదికగా - మిగతా3లో

# సంపాదకీయం

## విద్యామంత్రులకు ఏమౌతోంది....

విద్యార్థుల నిరసనల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. దీంతో ఆయన మోదీ ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖలో గడువు ముగియక ముందే బాధ్యతల నుంచి తప్పుకున్న మంత్రుల జాబితాలో చేరిపోయారుభారత విద్యా వ్యవస్థపై జంతర్ మంతర్ వద్ద మొదలైన ప్రశ్నలు, వారం రోజుల్లోనే దేశవ్యాప్త యువజన ఆందోళనగా మారాయి. కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్లను ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమ ముగింపును ప్రకటించారు.అయితే, ఈ ఉద్యమం భారత విద్యా వ్యవస్థ, పరీక్షల నిర్వహణ తీరు, ప్రభుత్వ ప్రాధాన్యతలపై ఒక కొత్త చర్చకు తెరలేపింది. ఇప్పుడు ప్రశ్నలు కేవలం ప్రస్తుత విద్యాశాఖ మంత్రిపైనే కాకుండా, మోదీ ప్రభుత్వ హయాంలో విద్యా మంత్రిత్వ శాఖ నడిచిన మొత్తం దిశపైనే వ్యక్తమవుతున్నాయి.2014 నుంచి ఇప్పటివరకు స్మృతి ఇరానీ, ప్రకాశ్ జావదేకర్, రమేశ్ పోఖ్రియాల్ 'నిశంక్', ధర్మేంద్ర ప్రధాన్ నాయకత్వంలో విద్యా మంత్రిత్వ శాఖ సరికొత్త విద్యా విధానాన్ని, సంస్థాగత మార్పులను, భావజాలపరమైన ఎన్నో చర్చలను చూసింది.ఈ సంవత్సరాలలో విద్యా వ్యవస్థను మెరుగుపరచడం కంటే భావజాల మార్పులకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని విమర్శకులు ఆరోపిస్తుండగా, ప్రభుత్వం మాత్రం దీనిని ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న నిర్మాణాత్మక సంస్కరణల ప్రక్రియగా పేర్కొంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో, మోదీ హయాంలోని నలుగురు విద్యాశాఖ మంత్రుల పాత్రను ఏ కోణంలో చూడాలనే ప్రశ్నను ప్రస్తుత వివాదం మరోసారి తెరపైకి తెచ్చింది.12 ఏళ్ల మోదీ ప్రభుత్వంలో విద్యా మంత్రిత్వ శాఖ మాత్రమే నలుగురు వేర్వేరు మంత్రుల మారిన ఏకైక కీలక శాఖగా నిలిచింది. అదే సమయంలో హోం, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక, రక్షణ, ఆరోగ్య వంటి మంత్రిత్వ శాఖలలో మాత్రం దాదాపు స్థిరత్వం కొనసాగింది.ముఖ్యమైన విషయమేమిటంటే, ఈ ముగ్గురు మాజీ విద్యాశాఖ మంత్రులు పదవుల నుంచి తప్పుకున్న కొద్ది సంవత్సరాలకే వివిధ కారణాల వల్ల కేంద్ర క్యాబినెట్ నుంచి కూడా పూర్తిగా కనుమరుగయ్యారు.సమాచార-ప్రసార శాఖలో గత 12 ఏళ్ల వ్యవధిలో ఏడుగురు కేంద్ర మంత్రులు, సంస్కృతి మంత్రిత్వ శాఖలో ఐదుగురు కేంద్ర మంత్రులు మారారు.మోదీ ప్రభుత్వ మొదటి విడత పదవీకాలంలో స్మృతి ఇరానీ, ప్రకాశ్ జావదేకర్ మానవ వనరుల వికాస మంత్రిత్వ శాఖ బాధ్యతలను నిర్వహించారు. మోదీ 2.0 హయాంలో ఈ బాధ్యత రమేశ్ పోఖ్రియాల్ నిశంక్‌కు దక్కింది.అయితే, 2021లో జరిగిన క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమించారు. ఆయన రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారులు నెల రోజుల పాటు జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు కూర్చున్నారు, చివరికి కేంద్ర ప్రభుత్వం ఆ ఒత్తిడికి తలొగ్గింది. పార్లమెంటులో నీట్ లీక్ వ్యవహారంపై చర్చ జరపడానికి మోదీ ప్రభుత్వం అంగీకరించింది, కానీ, రాజీనామా డిమాండ్‌ను చర్చకు షరతుగా పెట్టవద్దని ప్రతిపక్షాలకు కోరుతూ వచ్చింది. నీట్ పరీక్ష లీక్ కేసును పక్కన పెడితే, సంఘ్‌కు సంబంధించిన అన్ని ప్రధాన లక్ష్యాలను ధర్మేంద్ర ప్రధాన్ ఎలాంటి హడావుడి లేకుండా అమలు చేయడంలో విజయం సాధించారు..2014లో ఏర్పాటైన మొదటి మోదీ క్యాబినెట్‌లో ధర్మేంద్ర ప్రధాన్‌ను పెట్రోలియం శాఖ మంత్రిగా నియమించారు. ఆ తర్వాత మోదీ 2.0లో ఆయన విద్యాశాఖ మంత్రి అయ్యారు, మోదీ 3.0 పదవీకాలంలోనూ ఆ బాధ్యతల్లోనే కొనసాగారు.ఆయన పదవీకాలంలో జాతీయ విద్యా విధానానికి ఊతం లభించింది. మాతృభాష, పలు భాషల్లో విద్యను ఆయన ప్రోత్సహించారు. కానీ, త్రిభాషా సూత్రంపై తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంతో సుదీర్ఘకాలం పాటు వివాదాలకు కేంద్రబిందువుగా నిలిచారు.. రాజకీయ జోక్యం, 'హిందీ రుద్దడం' లాంటి ఆరోపణలను ప్రత్యర్థులు ఆయనపై గుప్పించారు, దీనివల్ల విద్యా విధానం కేంద్రం వర్సెస్ రాష్ట్రాల వివాదంగా మారింది.మోదీ పాలనలో విద్యాశాఖలో అవలంబించిన విధానాలన్నీ వామపక్ష భావజాలాన్ని తొలగించే లక్ష్యంతోనే అమలయ్యాయని శరద్ గుప్తా పేర్కొన్నారు.భారత విద్యా వ్యవస్థ నుంచి వామపక్ష విద్యా విధానాన్ని తొలగించడమే సంఘ్ ప్రధాన లక్ష్యం..2014లో స్మృతి ఇరానీని మానవ వనరుల అభివృద్ధి(హెచ్ఆర్డీ) మంత్రిగా నియమించినప్పుడు, ఆమె రాహుల్ గాంధీ చేతిలో ఓడిపోయిన తర్వాత క్యాబినెట్‌లో భాగమయ్యారు.మోదీ రెండవ విడత పదవీకాలంలో మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పేరును మార్చారు. జాతీయ విద్యా విధానంలోని ప్రధాన సిఫార్సులలో భాగంగా 'విద్యపై మరింత దృష్టి పెట్టడానికి' కేంద్ర ప్రభుత్వం ఈ మార్పు చేసింది.1985 కంటే ముందు ఈ శాఖను 'విద్యా మంత్రిత్వ శాఖ' అనే పిలిచేవారు. అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ పాలనలో దీని పేరును మార్చారు. అప్పట్లో 'విద్యను మరింత విస్తృత కోణంలో చూడటం' దీని వెనుక ఉన్న ఉద్దేశంగా చెప్పారు.2014 లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్ ప్రకారం, స్మృతి ఇరానీ చదువు 12వ తరగతి వరకే సాగింది. దీనిని కాంగ్రెస్ ఒక పెద్ద అంశంగా మార్చింది. అయితే, ఆమె పార్లమెంటులో హిందీ, ఇంగ్లీష్ భాషల్లో తన వాదనను చాలా స్పష్టంగా, బలంగా వినిపిస్తారని చెబుతూ బీజేపీ ఈ విమర్శలను తోసిపుచ్చింది.నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాతే నూతన విద్యా విధానంపై కసరత్తు మొదలైంది.మంత్రిత్వ శాఖలో స్మృతి ఇరానీ పదవీకాలంలో నూతన విద్యా విధానానికి సంబంధించిన పనులు ప్రారంభం కాగా, మోదీ హయాంలోని మూడవ విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ 'నిశంక్' సమయంలో దీనిని అమలు చేశారు.భారతదేశంలో నూతన విద్యా విధానం 34 సంవత్సరాల తర్వాత 2020లో అమల్లోకి వచ్చింది. దీనిని మోదీ పదవీకాలంలో ఒక పెద్ద అడుగుగా భావిస్తారు. నూతన విద్యా విధానంలో విద్యా బడ్జెట్‌ను జీడీపీలో ఆరు శాతంగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.నలుగురు విద్యాశాఖ మంత్రుల హయాంలో దాదాపు ప్రతి విశ్వవిద్యాలయంలోనూ అధ్యాపకుల ఎంపికలో భావజాలానికే పెద్దపీట వేశారు. ఈ విధంగా భవిష్యత్తులో ప్రభుత్వం మారినప్పటికీ, కనీసం రెండు తరాల పాటు విద్యా సంస్థలపై సంఘ్ తన ప్రభావాన్ని నిలుపుకోగలుగుతుంది" అన్నారు.వామపక్షాల పట్టుగా భావించే జేఎన్‌యూలో 2022లో శాంతిశ్రీ ధూళిపూడి పండిట్‌ను వైస్ ఛాన్సలర్‌గా నియమించారు. ఈ విశ్వవిద్యాలయ చరిత్రలోనే తొలి మహిళా వైస్ ఛాన్సలర్‌గా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో తనకున్న అనుబంధాన్ని బహిరంగంగా అంగీకరించిన వ్యక్తిగా ఆమె గుర్తింపు పొందారు. అశాస్త్రీయ ప్రకటనల వల్ల రమేశ్ పోఖ్రియాల్ వివాదాల్లో చిక్కుకున్నారు. 'చరక మహర్షి అణు-పరమాణువులను కనుగొన్నారు' అని కూడా ఆయన వ్యాఖ్యానించారు.కోవిడ్ సమయంలో జేఈఈ-నీట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించిన తర్వాత ఆయనపై ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. దీనికి వ్యతిరేకంగా పౌరులు కోర్టుకు కూడా వెళ్లారు, అక్కడ తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చింది. అయితే, అప్పట్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు, ఇది వివాదాస్పదమైంది.కోవిడ్ బారిన పడిన తర్వాత, అనారోగ్య కారణాల వల్ల రమేశ్ పోఖ్రియాల్ తన పదవికి రాజీనామా చేశారని అంటారు. కానీ, ఆ తర్వాత ఆయన మోదీ క్యాబినెట్ నుంచి పూర్తిగా తప్పుకున్నారు. ఆ స్థానంలో ధర్మేంద్ర ప్రధాన్ 2021 నుంచి జూలై 2026 వరకు ఈ బాధ్యతలను నిర్వహించారు.

# కాక్ రోచ్ కు నిధులపై ఆరా...

**న్యూఢిల్లీ జూలై 29:** కావలసినంత ఆహారం వచ్చింది. డ్రై ఫ్రూట్స్ ఊహించని విధంగా వచ్చాయి. మెడికల్ కిట్లు.. ఫాస్ట్ ఫుడ్.. డ్రింక్స్.. టెంట్లు.. రాళ్లు.. రప్పలు.. ఇవన్నీ ఆకాశరామన్న పంపించినట్టు పరుగులు పెట్టుకుంటూ వచ్చాయి. అసలు ఇవన్నీ ఎవరిచ్చారు.. ఎక్కడి నుంచి వచ్చాయి.. ఇంత ఖర్చు ఎవరు భరించారు.. అసలు ఆ పార్టీకి ఒక రూపం అంటూ లేదు. కనీసం క్షేత్రస్థాయిలో నిర్మాణం లేదు. కార్యకర్తలు లేరు. కేవలం సోషల్ మీడియా వేదికగా జరిగిన ప్రచారం ద్వారానే ఇంతటి ఉద్యమం పుట్టింది. మరి ఈ ఉద్యమం వెనుక ఉన్నది ఎవరు.. ఇప్పుడు ఈ విషయాలను బయట పెట్టే పనిలో పడ్డారు కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులు.కాక్రోచ్ జనతా పార్టీ లో అధికార ప్రతినిధిగా సౌరవ్ దాస్ కొనసాగుతున్నారు. ఈయనకు సంబంధించి బ్యాంక్ ఖాతా వివరాలను దర్యాప్తు సంస్థల అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి దిమ్మ తిరిగిపోయే నిజాలు తెలిసిపోయాయి. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ వ్యవహారంలో అసలు కోణం వేరే ఉందని తెలుస్తోంది. భారతీయ జనతా పార్టీ నాయకులు.. జాతీయ వాదులు అనుమానించినట్టుగానే.. దీని వెనక పెద్ద వ్యవహారం సాగిందని.. విదేశీ శక్తులు ఉన్నాయని ఇప్పుడు తెలుస్తోంది.సౌరవ్ దాస్ ఖాతాలో కొన్ని సంవత్సరాలుగా లక్షల డాలర్లు జమవుతున్నాయి. ఆమధ్య ఆయనకు 30




మిలియన్ డాలర్లు ఇచ్చేందుకు ఓ సంస్థ ముందుకు వచ్చిందని సమాచారం. అయితే ఆ డబ్బులు ఆయన ఖాతాలో పడలేదని తెలుస్తోంది. 16 మిలియన్ డాలర్లను నార్వేజియన్ ఏజెన్సీ ఫర్ డెవలప్మెంట్ కో ఆపరేటివ్ నో రాడ్ అనే సంస్థ ఇచ్చినట్టు సమాచారం. 2.4 మిలియన్ డాలర్లను లీడ్స్ ఫౌండేషన్ ఇచ్చినట్టు సమాచారం. తొమ్మిది లక్షల డాలర్లను ఓపెన్ సొసైటీ అనే సంస్థ ఇచ్చినట్టు తెలుస్తోంది.ఈ స్థాయిలో డాలర్ల సొమ్ము రావడంతోనే ఉద్యమాన్ని ఈ స్థాయిలో నిర్వహించగలిగారని జాతీయవాదులు ఆరోపిస్తున్నారు. పైగా ఆయనకు 30 మిలియన్ డాలర్లు ఇస్తామని ఒక సంస్థ ఈమెయిల్ ద్వారా సమాచారం పంపించడం దర్యాప్తు సంస్థల అధికారులను కలవరపాటుకు గురి చేస్తోంది. ఎక్కడో విదేశాల్లో ఉన్న వ్యక్తులు.. ఇక్కడ ఉద్యమాలకు డబ్బు ఇవ్వడం ఏంటనేది అర్థం కావడం. మరోవైపు బొద్దింకలు ఆందోళనలు చేస్తున్నప్పుడు కెనడా వేదికగా కార్యాలపాలు సాగించే ఖలిస్థాన్ వేర్పాటు వాదులు తెర ముందుకు వచ్చారు. ఇండియాలో ఇదే స్థాయిలో ఆందోళనలు చేస్తే భారీగా డబ్బులు ఇస్తామని ప్రకటించారు. దీనినిబట్టి కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనల వెనుక విదేశీ శక్తులు ఉన్నాయని అర్థమవుతోంది.కేవలం డబ్బులు మాత్రమే కాకుండా ఆందోళనలు జరుగుతున్నప్పుడు అక్కడి యువత కోసం భారీగా ఆహారం వచ్చింది. దుస్తులు కూడా వచ్చాయి. ఇక రాళ్లు.. మెడికల్ కిట్లు.. డబ్బుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ఇదంతా కూడా విదేశీ శక్తుల కుట్ర అని.. వారి మాయలో పడి మన విద్యార్థులు నాశనం కాకుండా ఉండడానికే ప్రభుత్వం ముందుగానే జాగ్రత్త పడిందని.. విద్యాశాఖ మంత్రితో రాజీనామా చేయించిందని జాతీయ వాదులు అభిప్రాయపడుతున్నారు. వచ్చే రోజుల్లో ఈ విచారణ మరింత వేగవంతంగా సాగితే అసలు నిజాలు బయటికి వస్తాయని.. అప్పుడు ముసుగు వీరులు.. కుట్ర వీరులు.. విదేశీ శక్తుల చేతిలో తొత్తులుగా మారిన వారు బయటపడతారని జాతీయవాదులు చెబుతున్నారు

# ఈ 20 సెగ....

**చెన్నై, జూలై 29:** నీట్ పరీక్షల వివాదం తర్వాత, ఇప్పుడు దేశంలో తదుపరి జెన్ జీ, మధ్యతరగతి ప్రజాగ్రహానికి కేంద్రంగా ఈ20 పెట్రోల్ ఇంధన విధానం మారబోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. సాధారణ వాహనదారులు, ముఖ్యంగా డెలివరీ బాయ్స్, ఉద్యోగులు, ద్విచక్ర వాహనదారులు రోజువారీ మైలేజ్ తగ్గిపోవడం, ఇంజిన్ పార్ట్‌లు త్వరగా పాడైపోవడం, నిరంతర రిపేర్ల వల్ల ఖర్చులు పెరగడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ ఆగ్రహం నెమ్మదిగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపైకి, ముఖ్యంగా రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ వైపునకు మళ్లుతోంది.ఈ వివాదంలో గడ్కరీ సొంత ప్రయోజనాలు, ఆయన కుటుంబ లాభాలు దాగి ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో డిజిటల్ , ా× డీప్‌ఫేక్ వీడియోలతో కూడిన ప్రచారం ఊపందుకుంది. అయితే, దీనిపై నితిన్ గడ్కరీ బాంబై హైకోర్టును ఆశ్రయించారు. ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ అనేది కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని విధానమని, రోడ్డు రవాణా శాఖ మంత్రిగా తనకు అందులో ఎలాంటి వ్యక్తిగత లేదా విధానపరమైన స్వార్థ ప్రయోజనాలు లేవని గడ్కరీ కోర్టులో స్పష్టం చేశారు. తన ప్రతిష్టకు భంగం కలిగించే దుష్ప్రచారాన్ని, డీప్‌ఫేక్ కంటెంట్‌ను తొలగించేలా మెటా, ఎక్స్, గూగుల్ సంస్థలపై సివిల్ దావా వేసేందుకు హైకోర్టు అనుమతి కూడా లభించింది.ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా ఈ20 వల్ల




ఇంజిన్లకు ప్రమాదం లేదని, మైలేజ్‌లో కోత కేవలం 3 నుండి 5 శాతమేనని సర్థించుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయి అనుభవాలు భిన్నంగా ఉన్నాయన్నది వినియోగదారుల వాదన. ప్రత్యేకించి 2023 కంటే ముందు తయారైన లేదా ఈ20-కాంపాటిబిలిటీ లేని వాహనాలలో ఫ్యూయల్ లైన్లు, కార్బొరేటర్లు, రబ్బర్ సీల్స్ త్వరగా పాడవుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు బంకుల్లో సాధారణ పెట్రోల్ ఈ10 లేదా ప్యూర్ పెట్రోల్ ప్రత్యామ్నాయంగా లభించకపోవడం లేదా ఎక్కువ ధరకు అందుబాటులో ఉండటం మధ్యతరగతి జేబులపై అదనపు భారాన్ని మోపుతోంది.మహారాష్ట్ర రాజకీయ పరిణామాలు, మంత్రుల రాజీనామాల వార్తల వల్ల ఈ వివాదం కొంతకాలం పక్కదారి పట్టినట్లు అనిపించినా, స్థానికంగా నిరసన జ్వాలలు చల్లారలేదు. దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రారంభమైన ఆందోళనలతో పాటు, పార్లమెంట్ ముట్టడికి రవాణా సంఘాలు పిలుపునిచ్చాయి. రోజువారీ వాహనాలపై ఆధారపడే యువత, ఉద్యోగులతో కూడిన జెన్ జీ నెట్‌వర్క్ సామాజిక మాధ్యమాల్లో దీనిపై పెద్ద ఎత్తున డిజిటల్ క్యాంపెయిన్ నిర్వహిస్తోంది. నీట్ వివాదంలో మాదిరిగానే యువత వీధుల్లోకి వస్తే, అది కేంద్రానికి కోలుకోలేని దెబ్బగా మారే ప్రమాదం ఉంది. గతంలో కీలక సమస్యలు ఎదురైనప్పుడు మంత్రులపై రాజీనామా ఒత్తిడి పెరిగినట్లే, ఈ ఇంధన వివాదంలోనూ ప్రతిపక్షాలు, ఉద్యమకారులు గడ్కరీ టార్గెట్‌గా వ్యూహాలు రచిస్తున్నారు. . క్షేత్రస్థాయి అసంతృప్తికి తగిన పరిష్కారం చూపకపోతే, ఇది గడ్కరీకి మరియు మోదీ ప్రభుత్వానికి తీవ్రమైన రాజకీయ సంక్షోభాన్ని తెచ్చిపెట్టవచ్చు.ఈ వివాదాన్ని కేవలం దుష్ప్రచారం, పెట్రోలియం లాబీ కుట్ర"గా కొట్టిపారేయడం ద్వారా ప్రభుత్వం ఈ నిరసనలను ఆపడం కష్టం. పాత వాహనదారులకు అవసరమైన సాంకేతిక మద్దతు ఇవ్వడం లేదా పెట్రోల్ బంకుల్లో ప్యూర్ పెట్రోల్, ఈ10 ఆప్షన్లను సరసమైన ధరకు అందుబాటులో ఉంచడం వంటి సానుకూల చర్యలు తీసుకోవాలి. లేకపోతే, ఈ ఈ20 వివాదం డిజిటల్ స్పేస్ నుండి నేరుగా వీధుల్లోకి చేరి పెద్ద రాజకీయ ఉద్యమంగా రూపాంతరం చెందే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేంద్రమే వేగంగా స్పందించాల్సి ఉంది.

# ఐదేళ్లలో 100 శాతం పెరిగిన బిలీయనర్లు

**న్యూఢిల్లీ, జూలై 29:** భారతదేశంలోని అత్యంత సంపన్నుల క్లబ్ ఇప్పుడు మరింత రద్దీగా మారింది. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పంచుకున్న డేటా ప్రకారం, అసెస్మెంట్ ఇయర్ 2025-26లో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక ఆదాయాన్ని నివేదించిన వ్యక్తుల సంఖ్య 576కి పెరిగింది. ా 2024-25లో ఇదే సంఖ్య 415గా ఉంది. దేశంలో బిలియనీర్ల సంఖ్యలో పెరుగుదలను ప్రభుత్వం గమనించిందా అనే ప్రశ్నకు సమాధానంగా, ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఒక లిఖితపూర్వక సమాధానంలో ఈ గణాంకాలను అందించారు.కొన్నేళ్లుగా భారతదేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందింది. స్టాక్ మార్కెట్ అనూహ్యంగా పుంజుకోవడం, స్టార్టప్‌ల విస్తరణ, కొత్త కర్మాగారాలు, పరిశ్రమలలో పెట్టుబడులు, డిజిటల్ వ్యాపారాల విస్తరణ, పెరుగుతున్న కార్పొరేట్ లాభాల ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. దీనికి అత్యంత స్పష్టమైన నిదర్శనం పార్లమెంటులో ప్రభుత్వం ఇటీవల గణాంకాలను సమర్పించింది.ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం, 2025-26 అసెస్మెంట్ సంవత్సరంలో 576 మంది వ్యక్తులు తమ ఆదాయపు పన్ను రిటర్న్‌లలో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక స్థూల ఆదాయాన్ని ప్రకటించారు. ఐదు సంవత్సరాల క్రితం 2021-22లో ఈ సంఖ్య కేవలం 142 మాత్రమే. అంటే ఐదేళ్లలో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ సంపాదించే వ్యక్తుల సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ఐటీఆర్‌లలో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక స్థూల ఆదాయాన్ని ప్రకటించిన వ్యక్తులను మాత్రమే ప్రభుత్వం లెక్కించింది.

రూ.100 కోట్లకుపైబడిన ఆదాయం ఉన్నవారు
2021-22 ఆర్థిక సంవత్సరంలో 142 మంది
2022-23లో 205 మంది
2023-24లో 395 మంది
2024-25లో 415 మంది
2025-26లో 576 మంది

ఇది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు, భారతదేశంలో వేగంగా జరుగుతున్న సంపద సృష్టికి ఇది ఒక సంకేతం. అలాగే ఇది ఆదాయపు పన్ను పరిధిని కూడా బలోపేతం చేస్తుంది.పార్లమెంటులోని ప్రశ్న 'బిలియనీర్ల'ను ప్రస్తావించినప్పటికీ, బిలియనీర్‌కు తమ వద్ద అధికారిక నిర్వచనం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దానికి బదులుగా, దేశంలోని అత్యధిక ఆదాయం సంపాదించేవారికి ప్రత్యామ్నాయంగా, రూ. 100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ



వార్షిక ఆదాయాన్ని నివేదించే పన్ను చెల్లింపుదారుల ఆదాయపు పన్ను రిటర్న్ డేటాపై ఇది ఆధారపడింది.100 కోట్ల క్లబ్ ఆవిర్భావం ప్రభుత్వానికి ఒక సానుకూల సంకేతంగా కూడా కనిపిస్తోంది. ఎక్కువ ఆదాయ ప్రకటనలు రావడం వల్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల మౌలిక సదుపాయాలు, సామాజిక కార్యక్రమాలు, మూలధన వ్యయాల కోసం ప్రభుత్వానికి మరిన్ని వనరులు సమకూరుతాయి.

# పాలిమర్స్ నోట్లు రెడీ

**ముంబై, జూలై 29:** దేశంలో రూ.10, రూ.20 డినామినేషన్‌లలో పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. 2012లోనే ఈ ఆలోచన చేసినా.. అనేక అవాంతరాలతో అమలు కాలేదు. తాజాగా ఆర్‌బీఐ పాలిమర్ కరెన్సీ ముద్రించాలని నిర్ణయించింది. దీంతో చాలా మందిలో ఇప్పటికే చలామణిలో ఉన్న కాగితపు నోట్లు రద్దు అవుతాయా ఇప్పటికే చలామణిలో ఉన్న కాగితపు నోట్లు రద్దు అవుతాయా ఒక సందేహం ఏర్పడింది. దీనికి కేంద్రం వివరణ ఇచ్చింది. కొత్త నోట్లు వచ్చినంత మాత్రాన పాతవి రద్దు చేయమని స్పష్టం చేసింది. రెండు రకాల నోట్లు కలిసి మార్కెట్‌లో ఉంటాయని తెలిపింది.కొత్త పాలిమర్ నోట్ల ప్రవేశం పాత కాగితపు నోట్ల స్థానాన్ని పూర్తిగా భర్తీ చేసేది కాదు. ప్రస్తుతం చలామణిలో ఉన్న నోట్లు కొనసాగుతాయి. ప్రజలు తమ దగ్గర ఉన్న కాగితపు నోట్లను ఏ మార్పు లేకుండా ఉపయోగించవచ్చు. రెండు రకాల నోట్లు ఏకకాలంలో మార్కెట్‌లో ఉండటంతో ఎలాంటి గందరగోళం లేదా అసౌకర్యం కలగదు. ఇది సాధారణంగా కరెన్సీ మార్పులలో జరిగే దశలవారీ విధానమే.నోట్ల మన్నిక పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం పాలిమర్ నోట్లు ముద్రించాలని నిర్ణయించింది. కాగితపు నోట్లు త్వరగా చిరిగిపోతాయి, మురికి పడతాయి, నీటికి లేదా వాతావరణ పరిస్థితులకు తట్టుకోలేవు. పాలిమర్ మెటీరియల్‌తో తయారైన నోట్లు ఎక్కువ కాలం నిలుస్తాయి. దీనివల్ల ముద్రణ ఖర్చు తగ్గుతుంది, నోట్లు తరచుగా మార్చాల్సిన అవసరం తగ్గుతుంది. ఇది దీర్ఘకాలిక ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలకు దారి తీస్తుంది.2012లోనే ఇలాంటి ప్రయత్నం జరిగింది. అయితే సాంకేతిక కారణాలతో అప్పుడు అమలు కాలేదు. ఇప్పుడు సాంకేతికత అభివృద్ధి చెందడంతో, అవసరమైన మౌలిక సదుపాయాలు సిద్ధం కావడంతో ఈ నిర్ణయం మళ్లీ ముందుకు వచ్చింది. గత అనుభవాల నుంచి నేర్చుకుని జాగ్రత్తగా కేంద్రం అడుగులు వేస్తోంది.ప్రస్తుతం చేతిలో ఉన్న కాగితపు నోట్లను మార్చాల్సిన అవసరం లేదు. రెండు రకాల నోట్లు చెల్లుబాటు అవుతాయి. కొత్త నోట్లు క్రమంగా మార్కెట్‌లోకి వస్తాయి. దీనివల్ల ఎలాంటి అత్యవసర పరిస్థితి లేదా భయాందోళనలు అవసరం లేదు. ప్రభుత్వం స్పష్టంగా చెప్పినట్టు, ఇది భర్తీ కాకుండా అదనపు ఎంపికగా వస్తోంది.

వార్తాతరంగాలు



# నిలిచిపోయిన ఆర్థిక సంఘం నిధులు

**వరంగల్, జూలై 29:**లంగాణ రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వివిధ కారణాల వల్ల నిలిచిపోయాయి. జిల్లా, మండల పరిషత్‌లకు సకాలంలో ఎన్నికలు జరగకపోవడం వలన 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. నిబంధనల ప్రకారం ఎన్నికైన ప్రజాప్రతినిధుల పాలకవర్గాలు ఉంటేనే ఫైనాన్స్ కమిషన్ నుంచి గ్రామీణ స్థానిక సంస్థలకు నేరుగా నిధులు వస్తాయి.తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వివిధ కారణాల వల్ల నిలిచిపోయాయి. జిల్లా, మండల పరిషత్‌లకు సకాలంలో ఎన్నికలు జరగకపోవడం వలన 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. నిబంధనల ప్రకారం ఎన్నికైన ప్రజాప్రతినిధుల పాలకవర్గాలు ఉంటేనే ఫైనాన్స్ కమిషన్ నుంచి గ్రామీణ స్థానిక సంస్థలకు నేరుగా నిధులు వస్తాయి. రాష్ట్రంలోని జిల్లా, మండల పరిషత్‌ల గడువు 2024 జూన్‌తోనే ముగిసింది. దీనివల్ల 2024-25 అలాగే 2025-26 సంవత్సరాలకు సంబంధించి వీటికి రావాల్సిన రూ. 448.65 కోట్ల నిధులు ఆగిపోయాయి. ఎన్నికలు జరగని గ్రామ పంచాయతీలకు కూడా రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన నిధుల్లో మొత్తంగా రూ.1,090.55 కోట్లు విడుదల కాకుండా పోయాయి. ప్రస్తుతం 16వ ఆర్థిక సంఘం ఉనికిలోకి రావడంతో గత ఆర్థిక సంఘం సిఫారసు చేసిన నిధులు క్యారీ ఫార్వర్డ్ కాలేదు. దీంతో జిల్లా, మండల పరిషత్‌లతో పాటు ఎన్నికలు జరగని గ్రామ పంచాయతీలకు నిధులు అందలేదు.రాష్ట్రంలో గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు 2024 ఫిబ్రవరిలోనే ముగియగా 2025 డిసెంబర్ వరకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో 2024-25 అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు అందలేదు. అయితే గతేడాది డిసెంబర్‌లో పంచాయతీ ఎన్నికలు పూర్తి కాగానే పాత బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కేంద్రానికి పలుమార్లు లేఖలు రాశారు. అలాగే నేరుగా ఢిల్లీకి వెళ్లి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితో సమావేశమై పరిస్థితిని వివరించారు. ఆ తర్వాత కొంతవరకు నిధులు




విడుదలయ్యాయి. 15వ ఫైనాన్స్ కమిషన్ గడువులోగా సిఫారసుల మేరకు అందాల్సిన నిధులు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 16వ ఫైనాన్స్ కమిషన్ గడువు మొదలైంది. దీంతో పాత కమిషన్ బకాయిలు కొత్త కమిషన్ హయాంలో క్యారీ ఫార్వర్డ్ ఆప్షన్ లేకపోవడంతో నిధులు మురిగిపోయినట్లయింది. నష్టపోయిన నిధులను తిరిగి తెప్పించుకునేందుకు రాష్ట్ర మంత్రి సీతక్క ప్రత్యేక ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఎలాంటి నిబంధనలు అలాగే లీగల్ చిక్కుల్లేనంత వరకు నిధులొస్తాయనే ధీమా అధికార వర్గాల్లో వ్యక్తమవుతున్నది.కేంద్ర ఆర్థిక సంఘం నిబంధనల ప్రకారం రాష్ట్రం నుంచి నిధుల విడుదలకు ప్రతిపాదనలు వచ్చే సమయానికి ఆయా గ్రామీణ స్థానిక సంస్థలకు అప్పటికే విడుదలైన నిధులన్నీ పూర్తిగా వినియోగమై ఉండాలి. గత ఆర్థిక సంవత్సరంలో రిలీజైన నిధులను సక్రమంగా ఖర్చు చేసినట్లు యుటిలైజేషన్ సర్టిఫికెట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు సమర్పించాలి. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు ఆలస్యంగా ఎన్నికలు జరగడంతో అప్పటివరకు రెడీ అయిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లను సమర్పించడంతో పాత బకాయిలు అందాయి. అందిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు పెట్టి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించనందున మరికొన్ని పంచాయతీలకు రావాల్సిన నిధులు పూర్తిగా రాలేదు. జిల్లా అలాగే మండల పరిషత్‌లు ఉనికిలోనే లేకపోవడంతో వాటికి రావాల్సిన రూ. 448.65 కోట్లు కూడా విడుదల కావడం పూర్తిగా అనుమానంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే ప్రతిపాదనలు అలాగే వినియోగ ధృవీకరణ పత్రాల ఆధారంగానే కేంద్రం నుంచి తదుపరి ఆర్థిక సహాయం ఆధారపడి ఉంటుంది.అధికారిక లెక్కల ప్రకారం జిల్లా పరిషత్‌లకు సంబంధించి 2024-25 సంవత్సరంలో రూ. 75.70 కోట్ల కేటాయింపు జరగగా విడుదల సున్నా, బకాయి రూ. 75.70 కోట్లుగా ఉంది. అలాగే 2025-26 సంవత్సరంలో రూ. 73.85 కోట్ల కేటాయింపు జరగగా విడుదల సున్నా, బకాయి రూ. 73.85 కోట్లుగా మిగిలింది. మొత్తంగా జిల్లా పరిషత్‌లకు రూ. 149.55 కోట్ల కేటాయింపు జరగగా విడుదల సున్నా కాగా బకాయి కూడా రూ. 149.55 కోట్లుగా నమోదైంది. మండల పరిషత్‌ల విషయానికి వస్తే 2024-25 సంవత్సరంలో రూ. 151.40 కోట్ల కేటాయింపు జరగగా విడుదల సున్నా, బకాయి రూ. 151.40 కోట్లుగా ఉంది. అలాగే 2025-26 సంవత్సరంలో రూ. 147.70 కోట్ల కేటాయింపు జరగగా విడుదల సున్నా, బకాయి రూ. 147.70 కోట్లుగా నిలిచింది. మొత్తంగా మండల పరిషత్‌లకు రూ. 299.10 కోట్ల కేటాయింపు జరగగా విడుదల సున్నా అలాగే బకాయి రూ. 299.10 కోట్లుగా తేలింది. ఈ గణాంకాలు స్థానిక సంస్థల ఆర్థిక పరిస్థితిని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.గ్రామ పంచాయతీల వివరాలను పరిశీలిస్తే 2024-25 సంవత్సరంలో రూ. 1,286.90 కోట్ల కేటాయింపు జరగగా రూ. 1,280.60 కోట్లు విడుదలయ్యాయి. దీనివల్ల కేవలం రూ. 6.30 కోట్లు మాత్రమే బకాయిగా మిగిలింది. అదేవిధంగా 2025-26 సంవత్సరంలో రూ. 1,255.45 కోట్ల కేటాయింపు జరగగా కేవలం రూ. 619.85 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. దీనివల్ల ఈ సంవత్సరంలో ఏకంగా రూ. 635.60 కోట్లు బకాయిగా నిలిచిపోయాయి. పంచాయతీలకు సంబంధించి ఈ నిధులొస్తేనే గ్రామీణాభివృద్ధి పనులు వేగవంతం అవుతాయి. పాలకవర్గాలు కొలువుదీరిన తరుణంలో ఈ బకాయిల సాధనపైనే స్థానిక సంస్థల అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం చేస్తున్న చొరవతో కేంద్రం నుంచి ఈ బకాయిలు వస్తాయని స్థానిక ప్రజలు ఆశిస్తున్నారు. లేదంటే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. పంచాయతీల ఆర్థిక పునరుజ్జీవనానికి ఈ నిధుల విడుదల అత్యంత కీలకమైన అంశంగా మారింది.

# ముందస్తుగా గుర్తిద్దాం క్యాన్సర్‌ను జయిద్దాం

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట:**విపంచి ఆడిటోరియంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ప్రారంభించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయించుకోవడం కంటే, రాకముందే గుర్తించి నివారించుకోవడం ఉత్తమ మార్గం అని మాజీ మంత్రి బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్పష్టం చేశారు.ప్రారంభ దశలో గుర్తింపే క్యాన్సర్‌పై విజయానికి కీలకం అన్నారు.సిద్ధిపేటలోని విపంచి ఆడిటోరియంలో సింధూ హాస్పిటల్ సహకారంతో నిర్వహిస్తున్న రెండు రోజుల ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ. ఆరోగ్యం కంటే గొప్ప సంపద మరొకటి లేదని, వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే ముందుగానే గుర్తించి నివారించుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు.క్యాన్సర్ కు భయపడాల్సిన అవసరం



లేదని, ప్రారంభ దశలో గుర్తిస్తే అనేక రకాల క్యాన్సర్లను పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు.ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన మహిళలు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు.కేన్సర్ వ్యాధితో కుటుంబాలు అన్ని రకాలుగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మారిన జీవనశైలి ఆహారపు అలవాట్లు క్యాన్సర్ కేసుల పెరుగుదలకు కారణమవుతున్నాయి అన్నారు.ఈ శిబిరంలో నిర్వహిస్తున్న మామోగ్రామ్, పాప్ స్మియర్ వంటి పరీక్షలు సాధారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చవుతాయని, ఇక్కడ మాత్రం పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొగాకు, గుట్కా, పాన్ మసాలా వంటి అలవాట్లు నోటి క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని పేర్కొంటూ, అలాంటి అలవాట్లను కుటుంబ సభ్యులకు మాన్పించే బాధ్యత అందరిదని అన్నారు.

ఈ కార్యక్రమానికి సహకరించిన హైదరాబాద్ సింధూ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు

# విద్యార్థులపై కాల్పులు జరిపించింది హోంమంత్రి

- మొదటి పేజీ తరువాయి

ఈ ప్రకటనను ఏ ప్రాతిపదికన చేశారు? మీరు క్షమాపణ చెప్పాలి. వారు విచారణకు డిమాండ్ చేస్తే, మేం అంగీకరిస్తాం. అఖిలేష్, మీరు చెబుతున్నది వేరు. రాహుల్ చెప్పింది తప్పు. నేరుగా ఆయన హోంమంత్రినే ప్రస్తావించారు. దేని ఆధారంగా ఇలాంటి ఆరోపణలు చేశారో చెప్పాలి. లేకుంటే రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి" అని అన్నారు.రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "అంతా ప్రైవేటీకరించారు. వ్యవస్థ ఆత్మను స్వాధీనం చేసుకున్నారు. దాన్ని ఆర్ఎస్ఎస్ ఆక్రమించుకుంది. ధర్మేంద్ర ప్రధాన్ ఎప్పుడూ విద్యా మంత్రిత్వ శాఖను నడపలేదు. దానిని నడిపే వ్యక్తి, సంస్థ ఆర్ఎస్ఎస్. మంత్రి కార్యాలయంలో కూర్చునే ఓఎస్డీయే దానిని నడిపే వ్యక్తి. దేశంలోని ప్రతి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఒక ఆర్ఎస్ఎస్ మనిషే. నిజమైన శత్రువు ఆర్ఎస్ఎస్, ధర్మేంద్ర ప్రధాన్ కాదు."విద్యార్థులు చేస్తున్న పోరాటాన్ని రాహుల్ గాంధీ సమర్థించారు. సభలో ఈ విషయంపై మాట్లాడుతూ ఇలా అన్నారు, "ఒక విద్యార్థి నిజం చెప్పడానికి భయపడడు. ఒక విద్యార్థి ఎవరిపైనా బల ప్రయోగం చేయడు. ఎదుటి వ్యక్తి అభిప్రాయం తన అభిప్రాయానికి భిన్నమైందని వారికి తెలుసు. దీనికి పూర్తిగా వ్యతిరేకంగా మరో వర్గం ఉంది. ఆ వర్గం వారు నిజాలను చెప్పరు. వారికి హింస అంటే ఇష్టం. వారికి అధికారం అంటే ఇష్టం. విద్యా వ్యవస్థ పట్ల విద్యార్థులు చాలా అసంతృప్తిగా ఉన్నారు. కొంతమంది ధనవంతులు పత్రికలను కొనుక్కున్నారు. పేదవారు, నిజాయితీపరులు బాధపడుతున్నారు." అని ఆరోపించారు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో విద్యార్థుల నిరసనలను యువత భావ వ్యక్తీకరణగా అభివర్ణించారు. వారి ఆగ్రహం సమర్థనీయమైందని నొక్కి చెప్పారు. అయితే, అధికార పార్టీ ఆయన ప్రసంగానికి పదే పదే అంతరాయం కలిగించడంతో, బిల్లుపై దృష్టి కేంద్రీకరించాలని స్పీకర్ ఆయనకు సూచించారు. రాహుల్ గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలలో అపార్లమెంటరీ భాషను ఉపయోగించడంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు."ఇది కోపం కాదు, హింస కాదు, ద్వేషం కూడా కాదు. ఇది దేశ యువత, రాబోయే తరం భావవ్యక్తీకరణ. బీజేపీతో సహా అన్ని రాజకీయ పార్టీలు ఈ భావనను గౌరవించాలి." అని రాహుల్ అన్నారు. ఈ విషయంపై బీజేపీ నాయకులు తమ పిల్లల అభిప్రాయాలను అడిగితే, వారికి కూడా విద్యార్థుల నుంచి మద్దతు లభిస్తుందని రాహుల్ గాంధీ అన్నారుకొంతమంది పిల్లలతో తాను మాట్లాడానని, వారు తమ ఆలోచనలు తెలియజేశారని రాహుల్ చెప్పారు. ఈ సందర్భంగా ఒక అమ్మాయిని, "విద్యార్థిగా ఉండటం అంటే ఏమిటి?" అని అడిగానని ఆమె చాలా చక్కని సమాధానం ఇచ్చిందన్నారు. విశాల దృక్పథం కలిగి, తమకు అన్నీ తెలియవని అంగీకరించే వారే విద్యార్థి అని ఆ అమ్మాయి చెప్పింది. 'ఇడియట్' అనే పదంపై అభిప్రాయం ఏంటని విద్యార్థులను అడిగినట్లు పేర్కొన్నారు. ఈ పదాన్ని ఆయన ఉపయోగించడం వివాదంగా మారింది.

**మూర్ఖులు ఎవరి మాట వినరు**

నీట్ పేపర్ లీక్ విషయంపై అవగాహనా పెంచుకోవడానికి బీజేపీ దాని మిత్ర పక్షాలు వారి పిల్లలతో మాట్లాడితే తెలుస్తుందని ఎద్దేవా చేశారు. విద్యార్థి అంటే నిరంతరం విషయాలు తెలుసుకునే వాడని, సత్యం కోసం పరిగెడుతుంటారని అన్నారు. విద్యార్థి విషయం నేర్చుకునేందుకు మన ఇంటి అన్ని ద్వారాలు తెరిచే ఉంటాలని జాతిపిత మహాత్మా గాంధీజీ చెప్పారని గుర్తుచేశారు. కొందరు మూర్ఖులు ఎవరి మాట వినరని, తమకు నచ్చిందే చేస్తూ పోతారంటూ పేపర్ లీక్ ఆందోళనో పాల్గొన్న విద్యార్థులు తనతో చెప్పారంటూ చేసిన వ్యాఖ్యలు లోక్‌సభలో దుమారం రేపాయి.లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్ బిల్లుపై జరిగిన వాడీవేడి చర్చలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

# అడవులను కాపాడుకుందాం...

- మొదటి పేజీ తరువాయి

ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును పరిరక్షించడమేనని అన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో వాటి సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నాటి ప్రధాని ఇందిరా గాంధి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో "ప్రాజెక్ట్ టైగర్" ను ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని వివరించారు.ఈ చర్యల ఫలితంగానే నేడు భారతదేశం ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం పులులు భారతదేశంలోనే ఉన్నాయని, దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రానికి కూడా ఈ విషయంలో విశిష్టమైన స్థానం ఉందని మంత్రి అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన పులుల అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు.అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, వాటి ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి స్పష్టం చేశారు.కవ్వాల్ టైగర్ రిజర్వ్ లో పులుల సంఖ్యను వృద్ధి చేసేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ ను చేపట్టినట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానించి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పించినట్లు వివరించారు. దీంతోపాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం వంటి కార్యక్రమాలను అటవీ శాఖ అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు.అడవులను కాపాడుకుందామని, వన్యప్రాణులను సంరక్షిద్దామని, భావితరాలకు పచ్చని తెలంగాణను అందిద్దామని ఈ సందర్భంగా మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా పులుల సంరక్షణకు అటవీ శాఖతో పాటు, ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులను ఉద్దేశించి "అటవీ సంపదను పరిరక్షించడంలో నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో పనిచేసి భావి తరాలకు పచ్చని తెలంగాణను అందించాలి" అని మంత్రి దిశా నిర్దేశం చేశారు.అటవీ సంపద, వన్య ప్రాణుల సంరక్షణలో విశేష కృషి చేసిన పలువురు అటవీ శాఖ ఉద్యోగులకు ప్రశాంస పత్రం తో పాటు, నగదు బహుమతిని మంత్రి సురేఖ అందించారు. అదే విధంగా అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రాలేఖన పోటీలో గెలిచిన విద్యార్థులకు మంత్రి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.

## 'సర్' ప్రక్రియను వేగవంతం చేయాలి..

- మొదటి పేజీ తరువాయి

మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

**ఢిల్లీలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం..**

కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు (బుధవారం) జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీ చంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో 'సర్' ప్రక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

## బంగాళాఖాతంలో మునిగిన వాళ్లే హైడ్రాను ముంచుతామంటారా?'..

- మొదటి పేజీ తరువాయి

వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

## తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట

- మొదటి పేజీ తరువాయి

వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తైన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

## హైడ్రాపై వారే నిర్ణయం

- మొదటి పేజీ తరువాయి

మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. కాళేశ్వరంపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

**మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నాం..**

కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, అఫ్రో ఇండియాతో రిహబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు.

**నాసిరకం డిజైన్‌తోనే కాళేశ్వరం కూలింది..**

కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని వెల్లడించారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు ఎలాంటి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఫ్లోగా ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టం చేశారని అన్నారు. కాపర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు రక్షణ..

- మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. 'పరీక్షల నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవు. పేపర్ లీక్‌లు, మోసపూరిత కార్యకలాపాలు, పరీక్షల గోప్యతను భంగం చేసే వారిపై కఠిన శిక్షలు అమలు చేస్తాం. ఈ చట్టం అమల్లోకి రావడంతో పోటీ పరీక్షలపై విద్యార్థుల్లో విశ్వాసం మరింత పెరుగుతుంది. ప్రతిభ ఆధారంగా అవకాశాలు లభించే వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇది కీలక మైలురాయిగా నిలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటూ పరీక్షా వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంది' అని అన్నారు.

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- మొదటి పేజీ తరువాయి

వేశారు.కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఇదివరకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా ఉండేది. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది.

## పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పిస్తే..

**నెలకు 25 కిలోల బియ్యం, రైస్ కుక్కర్, సైకిల్..!**

**నల్గొండ, జూలై 29:**ప్రభుత్వ పాఠశాలను కాపాడేందుకు గ్రామపంచాయతీ వినూత్న నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించే కుటుంబాలకు నెలకు 25 కిలోల అదనపు బియ్యం, ఒక రైస్ కుక్కర్, ఐదో తరగతి పూర్తయ్యాక సైకిల్ అందించనున్నట్లు ప్రకటించింది. అదనంగా స్కూల్ బ్యాగ్, నోట్‌బుక్స్, విద్యా సామగ్రి ఉచితంగా ఇవ్వనున్నారు. సర్పంచ్ నేతృత్వంలోని ఈ పథకం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు సూర్యాపేట జిల్లా నాగులపహాడ్ గ్రామపంచాయతీ వినూత్న నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించిన ప్రతి కుటుంబానికి నెలకు 25 కిలోల అదనపు బియ్యం, ఒక రైస్ కుక్కర్, ఐదో తరగతి పూర్తిచేసిన విద్యార్థికి కొత్త సైకిల్ అందజేయనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ప్రస్తుతం సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు ఎక్కువగా మొగ్గుచూపడంతో ప్రభుత్వ పాఠశాల్లో అడ్మిషన్లు భారీగా తగ్గిపోయాయి.

# అందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు

హైదరాబాద్:పవిత్రమైన గురు పౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువులందరికీ హృదయపూర్వక నమస్సుమాంజలులు తెలిపారు. “గురు పౌర్ణమి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు. మన జీవితాన్ని మలిచిన గురువుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేసే పవిత్రమైన రోజు. గురువు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ, వారి బోధనలను ఆచరిస్తే ప్రతి అడుగూ విజయానికి నాంది అవుతుంది” అని పేర్కొన్నారు.తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, గురువు జీవితానికి అర్థాన్ని, లక్ష్యాన్ని అందిస్తారని అన్నారు. జీవితానికి దిశానిర్దేశం చేసి, అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన జ్యోతిని వెలిగించి మనలోని సామర్థ్యాన్ని గుర్తించి, క్రమశిక్షణ, విలువలు, ధైర్యం, ఆత్మవిశ్వాసం వంటి అమూల్యమైన సంపదను ప్రసాదిస్తారని పేర్కొన్నారు.

# చిన్నతనంలోనే ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు

– మంత్రి కొండా సురేఖ



పసివయసులోనే చిన్నారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఎంపీ కల్చరల్ సెంటర్ లో చెస్ చెక్ మెట్ లో వరల్డ్ రికార్డ్ సృష్టించిన ఏడేళ్ల చిన్నారి నైరాకు బహుమతిని అందజేసి, తల్లిదండ్రులు రిషిక, నరేష్ లను అభినందించారు. ప్రతి చిన్నారులు ప్రతిభ దాగి ఉంటుందని వాటిని గుర్తించి ప్రోత్సహించడమే తల్లిదండ్రుల పని అన్నారు. అగ్రరాజ్యం అమెరికాలో ఉంటున్న తమ కుమార్తె చదరంగం పట్ల ఆసక్తి చూపడంతో నగరానికి చెందిన రాయ్ అకాడమీలో ఆన్లైన్ శిక్షణ అనంతరం నగరానికి వచ్చి నేరుగా శిక్షణ ఇప్పించడంతో క్రీడలో అద్భుతంగా రాణిస్తుందని అన్నారు. 153 చెక్ మెట్లను అతి తక్కువ సమయంలో పూర్తి చేయడం గర్వంగా ఉందని అన్నారు.

# రేవంత్ రెడ్డి ఉన్నారనే ధీమాతోనే ఆంధ్ర రైతులు పంటలు వేసుకుంటున్నారు: నిరంజన్ రెడ్డి

**జూరాల ప్రాజెక్టును సందర్శించిన నిరంజన్ రెడ్డి**

**రేవంత్ తమకు నీళ్లు ఇస్తారనే ధీమాతో ఆంధ్ర రైతులు ఉన్నారని వ్యాఖ్య**

**ఏపీ ప్రజలపై ఉన్న ప్రేమ తెలంగాణ రైతాంగంపై లేదని విమర్శ**



ఎల్నినో ప్రతికూల ప్రభావం ఉన్నప్పటికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు నీళ్లు ఇస్తారనే ధీమాతోనే ఆంధ్రప్రదేశ్ రైతులు పంటలు సాగు చేస్తున్నారని బీఆర్ఎస్ జాతీయ కార్యదర్శి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డిలతో కలసి ఈరోజు జూరాల ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ఆత్మకూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.జూరాల ప్రాజెక్టు నుంచి స్థానిక కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేయకుండా తెలంగాణ రైతులను గోస పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. “రేవంత్ రెడ్డి ఎట్లయినా సరే ఆంధ్రకు నీళ్లు తరలిస్తారన్న ముందస్తు నమ్మకంతోనే అక్కడి రైతులు ధైర్యంగా విత్తనాలు వేసుకుంటున్నారు” అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రికి ఏపీ ప్రజలపై ఉన్న ప్రేమ, ఇక్కడి తెలంగాణ రైతాంగంపై లేదనడానికి జూరాల కాలువల నిర్లక్ష్యమే నిదర్శనమని నిరంజన్ రెడ్డి దుయ్యబట్టారు.

# తెలంగాణలోని బొగత జలపాతం ఉగ్రరూపం.. సందర్శన నిలిపివేత

**వాయుగుండం ప్రభావంతో ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు**

**ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం**

**పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టిన అధికారులు**



వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని ఉత్తర జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ములుగు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వర్షాలకు ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన బొగత జలపాతం ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గత 10 గంటలుగా అటవీ ప్రాంతంలో వర్షం నిరంతరాయంగా కురుస్తుండటంతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరి జలపాతం ఉగ్రరూపం దాల్చింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి వద్ద ఉన్న బొగత జలపాతం సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. వరద ఉద్ధృతికి రాళ్లు జారే ప్రమాదం ఉండటంతో పాటు ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశమున్నందున పర్యాటకులు ఎవరూ జలపాతం వైపు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జలపాత పరిసర ప్రాంతాల్లో భద్రతను పెంచినట్లు తెలిపారు. వరద తగ్గి పరిస్థితి అదుపులోకి వచ్చేవరకు పర్యాటకులు పోలీసులు, అటవీ శాఖ అధికారుల ఆదేశాలను పాటించాలని సూచించారు.

# హైదరాబాద్-తిరుపతి ఫ్లైట్

**గంట ప్రయాణానికి రూ. 24 వేల బాదుడు.. కారణమిదే!**

**హైదరాబాద్ నుంచి తిరుపతికి విమాన చార్జీల మోత**

**శ్రీవాణి దర్శన టికెట్ల కోటాయే కారణమంటున్న నిపుణులు**

**చార్జీలు తగ్గించకపోతే ఎయిర్‌పోర్ట్ కౌంటర్ రద్దు చేస్తామని టీటీడీ హెచ్చరిక**

**విమానయాన సంస్థల తీరుపై తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆందోళన**

తిరుమల శ్రీవారి దర్శనానికి హైదరాబాద్ నుంచి విమానంలో వెళ్లాలనుకునే భక్తులకు విమానయాన సంస్థలు చుక్కలు చూపిస్తున్నాయి. కేవలం గంట ప్రయాణానికి కొన్ని సందర్భాల్లో ఏకంగా రూ. 24 వేల వరకు వసూలు చేస్తూ ప్రయాణికుల జేబులకు భారీ చిల్లు పెడుతున్నాయి. ఈ మార్గంలో ఇండిగో, అలయన్స్ ఎయిర్, ఎయిర్ ఇండియా సంస్థలు సర్వీసులు నడుపుతుండగా, సాధారణ రోజుల్లోనే టికెట్ ధర రూ. 5,700 నుంచి రూ. 13,500 వరకు ఉంటోంది. చివరి నిమిషంలో బుక్ చేసుకుంటే ఈ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. హైదరాబాద్ నుంచి సుదూర నగరాలైన ఢిల్లీ, ముంబైలకు రూ. 3,500 నుంచి రూ. 7 వేలకే టికెట్లు లభిస్తుండగా, తిరుపతికి మాత్రం ఈ స్థాయిలో చార్జీలు వసూలు చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**శ్రీవాణి దర్శన టికెట్లే కారణమా?**

ఈ భారీ ధరల పెరుగుదల వెనుక ‘శ్రీవాణి వీఐపీ దర్శన కోటా’ ప్రధాన కారణంగా కనిపిస్తోంది. తిరుపతి ఎయిర్‌పోర్టులో విమాన ప్రయాణికుల కోసం టీటీడీ ప్రత్యేకంగా ఒక కౌంటర్ ఏర్పాటు చేసి, రోజుకు సుమారు 200 శ్రీవాణి వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లను జారీ చేస్తోంది. చెల్లుబాటయ్యే బోర్డింగ్ పాస్ చూపిస్తే ముందు వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత పద్ధతిలో ఈ టికెట్లు కేటాయిస్తున్నారు.


# నల్గొండ కాంగ్రెస్ లో చిచ్చు...



**నల్గొండ, జూలై 29:**ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో విభేదాలు మళ్లీ బహిర్గతం అయ్యాయి. కోమటిరెడ్డి బ్రదర్స్‌పై ఎమ్మెల్యే మందుల సామేల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తనకు సమాచారం ఇవ్వకుండా తన నియోజకవర్గంలోకి వచ్చారని.. ప్రోటోకాల్ ఉల్లంఘించారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రోడ్డు మంజూరు కోసం మంత్రి కోమటిరెడ్డి తిప్పించుకున్నారని.. రాజ్‌గోపాల్ రెడ్డి పార్టీ మారి తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చారని మండిపడ్డారు. తప్పుడు వ్యక్తిని గెలిపించానని రాజగోపాల్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు.కోమటిరెడ్డి సోదరులపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలతో.. కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత విబేధాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. తన తుంగతుర్తి నియోజకవర్గంపై కోమటిరెడ్డి బ్రదర్స్ పెత్తనం ఏంటని మందుల సామేల్ నిలదీశారు. దీంతో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కల్లోలం బయటికి వచ్చింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై సొంత పార్టీ ఎమ్మెల్యే మందుల సామేల్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తనకు సమాచారం ఇవ్వకుండా తన నియోజకవర్గంలో పర్యటించడం ప్రోటోకాల్‌కు విరుద్ధమని ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.నల్గొండ జిల్లా మీ రాజ్యం అనుకుంటున్నారా అంటూ ప్రశ్నించిన మందుల సామేల్.. తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల గురించి వ్యాఖ్యలు చేసే ముందు మునుగోడు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి హితవు పలికారు. తాము ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో గెలిచామని.. ఎవరి దయాదాక్షిణ్యాలతో ఈ పదవిలోకి రాలేదని స్పష్టం చేశారు. తన నియోజకవర్గ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని తీవ్ర హెచ్చరికలు చేసిన మందుల సామేల్.. కాంగ్రెస్ పార్టీ కోసం లంబాడా సామాజిక వర్గం చేసిన సేవలను గుర్తించి వారికి మంత్రి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తన హక్కులను కాలరాస్తే పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని కూడా హెచ్చరించారు. 2 కిలోమీటర్ల రోడ్డు కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చుట్టూ వందసార్లు తిరిగానని మందుల సామేల్ పేర్కొన్నారు. మంత్రిగా ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. రాజగోపాల్‌రెడ్డికి తుంగతుర్తి నియోజకవర్గం గురించి ఎందుకని నిలదీశారు. తన నియోజకవర్గం జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని.. ఒకవేళ ప్రొటోకాల్ ఉల్లంఘించి.. తనకు సమాచారం లేకుండా తన నియోజకవర్గంలో అడుగుపెట్టే అధికారం ఎవరు ఇచ్చారని హెచ్చరించారు. మందుల సామేల్ తుంగతుర్తిలోనే ఉంటాడు ఖబడ్దార్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఈ వ్యాఖ్యలపై స్పందించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యక్తిగతంగా తనకు మందుల సామేల్‌తో ఎలాంటి విభేదాలు లేవని చెప్పారు. ఈ సందర్భంగా తుంగతుర్తి కాంగ్రెస్ కార్యకర్తలకు క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నారు. అదే సమయంలో మందుల సామేల్‌కు కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే టికెట్ ఇప్పించడంలో తానే కీలక పాత్ర పోషించానని తెలిపారు. ఆయనకు టికెట్ ఇవ్వడానికి ముందు తన ఇంటికి మందుల సామేల్ 100 సార్లు వచ్చాడని రాజ్‌గోపాల్ రెడ్డి తెలిపారు. పోటీలో చాలా మంది ఉన్నా మాట ఇచ్చినందుకు మందుల సామేల్‌కు టికెట్ ఇప్పించి, గెలిపించానని పేర్కొన్నారు.ఎన్నికల్లో మందుల సామేల్ గెలుపు కోసం ప్రచారం కూడా చేశానని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు మాత్రం ఒక తప్పుడు వ్యక్తిని గెలిపించానని బాధపడుతున్నానని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాపాడటం తన బాధ్యత అని పేర్కొన్న రాజగోపాల్‌రెడ్డి.. పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యమని తేల్చి చెప్పారు.

# పాపం... సీఎస్...

## గెస్ట్ హౌస్, బంధువుల ఇళ్లలో మకాం...



**హైదరాబాద్, జూలై 29:**రాష్ట్ర ప్రభుత్వంలో అత్యున్నత అధికార పదవి అయిన చీఫ్ సెక్రటరీ హోదా ఎంతో గౌరవప్రదమైనది మరియు కీలకమైనది. వివిధ ప్రభుత్వ విభాగాలన్నింటికీ అధిపతిగా వ్యవహరించే సీఎస్, ముఖ్యమంత్రి అందుబాటులో లేనప్పుడు కీలక నిర్ణయాలు తీసుకునే బాధ్యతను నిర్వహిస్తారు. అయితే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజుకు ప్రస్తుతం అధికారిక నివాసం అందుబాటులో లేకపోవడం సచివాలయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. సుదీర్ఘకాలం కేంద్ర సర్వీసుల్లో సేవలందించిన ఆయనకు హైదరాబాద్ నగరంలో సొంతిల్లు లేదు. దీంతో ఈ నెల 1వ తేదీన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయనకు నివాస ఇబ్బందులు తప్పడం లేదు. మొదట్లో బంధువుల ఇళ్లలో తలదాచుకున్న ఆయన, ప్రస్తుతం లోక్‌భవన్ సమీపంలోని దిల్‌ఖుషా గెస్ట్ హౌజ్‌కు మారువలసి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని తానై వ్యవహరించే ముఖ్య కార్యదర్శికి సరైన వసతి కరువవడం, తాత్కాలిక గెస్ట్ హౌజ్‌లలో కాలం వెళ్లదీయాల్సి రావడం పరిపాలనా వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది.ప్రభుత్వం అధికారికంగా చీఫ్ సెక్రటరీ కోసం హైదరాబాద్‌లోని కుందన్‌బాగ్‌లో ఒక విశాలమైన బంగళాను నిర్మించి కేటాయించింది. రాష్ట్రం ఏర్పడిన తొలి రోజుల్లో రాజీవ్‌శర్మ, ఆ తర్వాత ఎస్‌కే జోషి వంటి సీనియర్ అధికారులు ఈ అధికారిక నివాసంలోనే తమ కుటుంబాలతో కలిసి నివసించారు. అయితే ఆ తర్వాత వచ్చిన సోమేశ్ కుమార్ అత్తాపూర్‌లోని తన సొంతింట్లో ఉండగా, శాంతికుమారి ప్రశాసన్ నగర్‌లోని స్వగృహంలో ఉన్నారు. ఆ తరువాత బాధ్యతలు నిర్వర్తించిన రామకృష్ణారావు కూడా ఈ బంగళాను ఉపయోగించలేదు. ఇలా దాదాపు ఐదారేండ్లుగా ఈ అధికారిక క్వార్టర్ ఖాళీగా ఉండటంతో, దాన్ని ప్రస్తుత నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన క్యాంప్ ఆఫీసు అవసరాల కోసం వాడుకుంటున్నారు. ప్రస్తుతం ఆ బంగళాలో మంత్రికి సంబంధించిన మినిస్టీరియల్ సిబ్బంది ఉంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మంత్రులందరికీ ప్రత్యేకంగా క్వార్టర్లు కేటాయించినప్పటికీ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాటిని తీసుకోకుండా సొంతింట్లో ఉంటున్నారు.మంత్రులకు ప్రభుత్వం నివాస వసతులు కల్పించినప్పటికీ, కేటాయించిన క్వార్టర్లలో కాకుండా ఇతర అధికారిక భవనాలను తమ అవసరాలకు వాడుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుందన్‌బాగ్‌లోని సీఎస్ బంగళా గత ఐదేళ్లుగా ఖాళీగా ఉండటంతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దానిని ఆక్రమించుకున్నట్లుగా పరిస్థితి తయారైంది. ప్రస్తుతం సంజయ్ జాజుకు నగరంలో సొంత ఇల్లు లేదని, ఆయన బంధువుల ఇళ్లు, గెస్ట్ హౌస్‌ల చుట్టూ తిరగాల్సి వస్తోందని తెలిసినప్పటికీ మంత్రి ఆ భవనాన్ని ఖాళీ చేయకపోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వంటి అత్యున్నత స్థాయి అధికారిక హోదా ఉన్న వ్యక్తికి సర్కారు బంగళా అందుబాటులో లేకపోవడం కేవలం ఒక గృహ సమస్య మాత్రమే కాదని, ఇది ఒక రకంగా ప్రభుత్వ వ్యవస్థలో నెలకొన్న సమన్వయ లోపానికి నిదర్శనమని సచివాలయ ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. అత్యున్నత అధికారిక హోదా ఉన్న వ్యక్తి నివాసం కోల్పోవడం ప్రభుత్వానికి పరోక్షంగా ఇబ్బందికర పరిణామంగా మారుతోంది.మంత్రులకు మరియు ఉన్నతాధికారులకు ఇళ్ల కేటాయింపుల విషయంలో నేరుగా ముఖ్యమంత్రి తుది నిర్ణయం తీసుకుంటారు. అయితే ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితిని గమనించినప్పుడు, అత్యున్నత అధికారి ఎదుర్కొంటున్న నివాస సమస్యను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి హెడ్‌గా వ్యవహరించే చీఫ్ సెక్రటరీ అవసరాలను గుర్తించి, కుందన్‌బాగ్‌లోని అధికారిక బంగళాను తక్షణమే ఆయనకు కేటాయించాల్సిన బాధ్యత పెద్దల మీద ఉంది. దాదాపు నాలుగు వారాలుగా సీఎస్ ఎక్కడ ఉంటున్నారనే కనీస సమాచారం కూడా చాలామంది ఐఏఎస్ అధికారులకు పూర్తిగా తెలియకపోవడం గమనార్హం. కేవలం తాత్కాలిక బసల మీద ఆధారపడటం వల్ల అధికారిక విధులకు కూడా ఆటంకం కలిగే అవకాశం ఉంది. ఈ అంశంపై ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని, బంగళాను ఖాళీ చేయించి చీఫ్ సెక్రటరీకి అప్పగిస్తారా లేక వేరే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తారా అనేది ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ మరియు అధికార వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్న ప్రధాన విషయంగా మారింది.రాష్ట్ర పరిపాలనా యంత్రాంగానికి గుండెకాయ లాంటి సచివాలయంలో చీఫ్ సెక్రటరీ పాత్ర అత్యంత కీలకం. అలాంటి కీలక పదవిలో ఉన్న వ్యక్తికి నగరంలో శాశ్వత నివాసం లేకపోవడం, ప్రభుత్వం కేటాయించిన అధికారిక బంగళా కూడా అన్యాక్రాంతం కావడం పరిపాలనా వైఫల్యానికి అద్దం పడుతోంది. సీఎస్‌కు అఫీషియల్ రెసిడెన్సీ లేకపోవడం వల్ల విదేశీ లేదా అంతరాష్ట్ర ప్రతినిధులు కలిసే సందర్భాల్లోనూ ప్రొటోకాల్ పరమైన ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రజాప్రతినిధుల వ్యక్తిగత క్యాంప్ ఆఫీసులుగా మారడం సరికాదనే అభిప్రాయాలు మేధావి వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ సున్నితమైన అంశాన్ని తీవ్రంగా పరిగణించాలి. సీఎస్ సంజయ్ జాజు ఎదుర్కొంటున్న ఈ గృహ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, ఆయన గౌరవానికి తగిన విధంగా అధికారిక బంగళాను వెంటనే ఆయన హ్యాండోవర్ చేసేలా చూడాలి. లేనిపక్షంలో ప్రభుత్వంలో ఉన్నతాధికారుల పట్ల అనుసరిస్తున్న తీరుపై మరింత వ్యతిరేకత వచ్చే అవకాశం లేకపోలేదు.

# హెచ్ఎండీఏ సరికొత్త మాస్టర్ ప్లాన్..

## చిరు వ్యాపారుల కోసం వెండర్ జోన్లు

**హైదరాబాద్, జూలై 29:**హైదరాబాద్ నగరంలో చౌరస్తాలు, రోడ్ల పక్కన ఉన్న చిన్న చిన్న ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా కాపాడేందుకు, వాటి ద్వారా ఆదాయం పొందేందుకు హెచ్ఎండీఏలోని హుమ్టా సరికొత్త ప్రణాళిక రూపొందించింది. అక్రమ ఆక్రమణలను అరికట్టడంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఈ స్థలాల్లో వెండర్ జోన్లు ఏర్పాటు చేసి షాపులు నిర్మించాలని నిర్ణయించారు. మొదటి దశలో అమీర్ పేట జంక్షన్, సత్యం థియేటర్ ఎదురుగా ఉన్న స్థలాల్లో ఈ వెండర్ జోన్లను అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ షాపులను నిర్మించి చిరు వ్యాపారులకు అద్దెకు ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి శాశ్వత ఆదాయం సమకూరుతుందని అధికారులు భావిస్తున్నారు.హైదరాబాద్ నగరంలో ఆక్రమణల బారిన పడుతున్న చిన్నచిన్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడంతో పాటు వాటి ద్వారా ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూర్చే దిశగా హెచ్ఎండీఏ పరిధిలోని హుమ్టా కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని ప్రధాన చౌరస్తాలు, రోడ్ల సమీపంలో నిరుపయోగంగా ఉన్న చిన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి, వాటిని ఆధునిక వెండర్ జోన్ల రూపంలో అభివృద్ధి చేయాలని భావిస్తోంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధుల్లోని పలు ప్రాంతాలలో ఈ సరికొత్త ప్రణాళికను అమలు చేయడానికి అధికారులు పకడ్బందీ సన్నాహాలు చేస్తున్నారు.నగరంలో చాలా చోట్ల ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు, ఫుట్‌పాత్‌లను కొందరు ఆక్రమించుకుని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండగా.. ప్రభుత్వానికి చెందిన విలువైన ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హుమ్టా అధికారులు చక్కని ప్రణాళిక సిద్ధం చేశారు. ఆయా స్థలాల్లో చిన్నచిన్న శాశ్వత షాపులు నిర్మించి వాటిని రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు అద్దెకు కేటాయించనున్నారు. దీనివల్ల ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు ప్రభుత్వ భూములు కబ్జాదారుల నుంచి సురక్షితంగా ఉంటాయి. అంతేకాకుండా చిరు వ్యాపారులకు శాశ్వత ఉపాధి లభించి వారి జీవనోపాధి మెరుగుపడుతుంది. ఈ ప్రత్యేక ప్రాజెక్ట్‌లో భాగంగా మొదటి దశలో నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ముఖ్యంగా అమీర్ పేట జంక్షన్, సత్యం థియేటర్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ప్రస్తుతం అక్కడ కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా వాహనాల పార్కింగ్, చిన్న డబ్బాలు, తోపుడు బండ్ల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల నిత్యం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో తొలి విడతగా అమీర్ పేట ప్రాంతంలోనే అధికారికంగా వెండర్ జోన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ అన్ని రకాల మౌలిక వసతులతో షాపులను నిర్మించి చిరు వ్యాపారులకు కేటాయించడం ద్వారా ప్రభుత్వానికి క్రమం తప్పకుండా అద్దెల రూపంలో ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.మొదటి దశ ప్రయోగం విజయవంతమైన తర్వాత నగరంలోని జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ పరిధుల్లో ఉన్న మిగతా ప్రధాన చౌరస్తాలు, రోడ్ల పక్కన ఉన్న ఖాళీ స్థలాలను కూడా ఇదే పద్ధతిలో అభివృద్ధి చేయాలని హుమ్టా ప్రణాళిక రూపొందించింది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారుల సహకారంతో ఈ సర్వేను వేగవంతం చేస్తున్నారు. అనధికార ఆక్రమణలను తొలగించి పారదర్శకమైన విధానంలో అర్హులైన చిరు వ్యాపారులకే ఈ షాపులను కేటాయించనున్నారు. దీనిద్వారా ప్రభుత్వ స్థలాలకు శాశ్వత రక్షణ లభించడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అదనపు ఆదాయం సమకూరుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కారులో మంటలు



**హైదరాబాద్:**పివి నరసింహా రావు ఎక్స్ ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 278 దగ్గర కారులో మంటలు చెలరేగాయి. వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు స్పందించి నిమిషాల్లో మంటలను అదుపు చేసారు. ఘటనలో కారులోని వారు సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికీ ఏమీ కాలేదు. కొద్ది సేపట్లలోనే ట్రాఫిక్ ను క్రమబద్దం చేసారు.

# హైడ్రా కు మద్దతుగా ర్యాలీ

**మేడ్చల్:**హైడ్రా కు మద్దతుగా శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర గౌడ్.. మెట్టు సాయికుమార్ చైర్మన్ ఫిషర్మెన్ ఆధ్వర్యంలో తమ్మడి కుంట చెరువు వద్ద ర్యాలీ నిర్వహించారు. వర్షం కూడా లెక్క చేయకుండాన హైడ్రా కమీషనర్ రంగనాథ్ మద్దత్తు దారులు వచ్చారు. చుట్టుపక్క కాలనీవాసులు హైడ్రా కమీషనర్ రంగనాథ్ కి మద్దతు తెలిపారు. హైడ్రా వల్ల వర్షాకాలం ఇబ్బందులు తప్పాయని కాలనీ వాసులు అన్నారు. హైడ్రా ఉండాల్సిందేనని నినాదాలు చేసారు.

వార్తాతరంగాలు

గురువారం 30 జూలై 2026

# మక్తల్ పట్నంలో కుక్కల వీరంగం





**మక్తల్ జులై 29 ( స్కై న్యూస్ ):**నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని వీధి కుక్కల సమస్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. గత ఏడాది నుంచి పలుమార్లు మారిన మున్సిపల్ కమిషనర్ల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదు. ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ వెంటనే స్పందించి అమాయక ప్రజలు, విద్యార్థుల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం కలగకుండా తక్షణ చర్యలు తీసుకుని మక్తల్ మున్సిపాలిటీ ప్రజలకు భరోసా కల్పించాలని కోరుతున్నాను.నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులోని అనపల్లి వీధిలో మహేశ్వరి అనే మహిళపై వీధి కుక్క దాడి చేసి కరవడం అత్యంత బాధాకరం. ఆ సమయంలో ఆమె పక్కనే చిన్న పిల్లలు కూడా ఉండగా, వారిని ముందుగా సురక్షితంగా పక్కకు పంపించిన అనంతరం కుక్క ఆమెపై దాడి చేసింది.మహేశ్వరిని నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు ఆమెను మూడు రోజుల పాటు అడ్మిట్ కావాలని సూచించినట్లు తెలిసింది. మహేశ్వరిని కరిచిన అనంతరం ఇదే కుక్క మరో వ్యక్తిపై కూడా దాడి చేసింది. పతంజలి షాపుకు చెందిన బాల్రాజ్ అనే వ్యక్తిని ఏకంగా మూడు చోట్ల కుక్క కరిచింది. ఆయన కూడా చికిత్స కోసం నారాయణపేట జిల్లా ఆసుపత్రికి వెళ్లారు. ప్రస్తుతం కుక్క కాటుకు గురైన ఇద్దరు బాధితులను మెరుగైన చికిత్స కోసం నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఇప్పటివరకు అందుతున్న సమాచారం ప్రకారం మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో 7 మందికి పైగా వీధి కుక్కల కాటుకు గురైనట్లు పూర్తి సమాచారం తెలుస్తోంది. ఈ ఘటన ప్రజల్లో తీవ్ర భయాందోళనలకు కారణమైంది.ఈరోజు జరిగిన ఘటనపై నేను వెంటనే మక్తల్ మున్సిపల్ కమిషనర్ రాజయ్య గారికి ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలియజేశాను. ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరాను. దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ రాజయ్య గారు, “ఈ అంశాన్ని తప్పకుండా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటాము” అని హామీ ఇచ్చారు. ప్రజల భద్రత దృష్ట్యా ఆ హామీని వెంటనే అమలు చేసి, వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నాను.మక్తల్ పట్టణంలో వీధి కుక్కల సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని నేను గత ఏడాది నుంచే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకువస్తున్నాను. గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్లకు కూడా ఎన్నోసార్లు ఈ సమస్యను వివరించి, ప్రజలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలియజేశాను. అప్పట్లో అధికారులు కొద్ది రోజుల్లోనే వీధి కుక్కల సమస్యపై చర్యలు తీసుకుని, అవసరమైన వైద్య చికిత్స అందించి, సురక్షితమైన ప్రాంతాలకు తరలిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ నేటి వరకు అమలు కాలేదు.దీని ఫలితంగా ఇప్పటికే ఎంతోమంది కుక్కల దాడులకు గురయ్యారు. ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు చొప్పున ఎక్కడో ఒకచోట కుక్కల దాడులు జరుగుతూనే ఉన్నాయి.అందువల్ల ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ వెంటనే స్పందించి మున్సిపల్ కార్యాలయం నుంచి తక్షణ చర్యలు చేపట్టి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అలాగే వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలి.ఇకపై అమాయక ప్రజలు, చిన్నారులపై కుక్కల దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మక్తల్ మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించి, వీధి కుక్కల బెడద నుంచి అమాయక ప్రజలను, చిన్నారులను కాపాడాలని మున్సిపల్ కమిషనర్, బ్యాటరీ రాజు బిజెపి కార్యదర్శి విజ్ఞప్తి చేశారు.

# మాదిగల రాజ్యాధికార సముపార్జనే ఏకైక ఎజెండా

**మహోద్యమంగా దూసుకువెళుతున్న మాదిగ మహాశక్తి**

**అన్ని రాజకీయ పార్టీలలోనూ మాదిగలకు అన్యాయమే**

**లక్ష్యసాధనకు అందరు కలిసి రావాలి**

**మాదిగలకు మాజీ మంత్రి, మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కుపల్లి నర్సింహులు పిలుపు**

**( రాగి సహదేవ్ ) ( మహేశుని లక్ష్మయ్య )**



**హైదరాబాద్ జులై 29 ;** రాష్ట్రంలో 70 లక్షలకు పైగా జనాభా ఓట్ల బలమున్న మాదిగ జాతికి అన్ని రాజకీయ పార్టీలు అనాదిగా అన్యాయం చేస్తూనే వస్తున్నాయని... ఇప్పటికైనా మనం ఏకమవుదామనిమాదిగలకు మాజీ మంత్రి, మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కుపల్లి నర్సింహులు పిలుపు నిచ్చారు.అన్నిట్లోనూ అన్యాయమే...జరుగుతుంది.

జనాభా దామాషా ప్రకారం సీట్ల కోసం పోరాడుదాం.. రాజ్యాధికారం కోసం చేయి చేయి కలుపుదాం అని అన్నారు.

**అన్నిట్లోనూ అన్యాయమే...**

రెడ్ల జనాభా ఎంత?.. వారికి 43 అసెంబ్లీ సీట్లు ఎలా ఇచ్చారు.. 70 లక్షల జనాభా ఉన్న మాదిగలకు న్యాయంగా 19 సీట్లు దక్కాలి.. నామ మాత్రపు సీటు ఇచ్చి చేయి దులుపుకున్నారు... మూడు ఎంపీ సీట్లకు గాను ఒక సీటు కూడా మాదిగలకు ఇవ్వలేదు.. ఇక ఎమ్మెల్సీ సీట్లు ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించక అవమానపరిచారు.. ఇది అన్యాయం కాదా అని అన్ని రాజకీయ పార్టీలను మోత్కుపల్లి నర్సింహులు ప్రశ్నించారు. అటు పార్లమెంట్లో గానీ ఇటు శాసనసభ శాసనమండలిలో గాని మాదిగలకు కల్పించిన స్థానం ఎంత అని ఆయన ఆవేదనతో చెప్పుకొచ్చారు .

**ఓట్లు మావి... సీట్లు మీవా?**

పార్టీల జెండాలు మోసి... ఓట్లు వేసి... గెలిపిస్తే మాదిగలకు వారు చేస్తున్న న్యాయం ఎంత?.. పాలకులు, ప్రతిపక్షాలు ఆత్మ విమర్శ చేసుకోవాలి... మాదిగలు రాజకీయ శక్తిగా ఎదగక పోవడానికి కారణం ఎవరు?.. ఇక ఈ అన్యాయాన్ని సహించేది లేదు.. ఉద్యమిస్తాం.. న్యాయం కోసం పోరాడుతాం అని మోత్కుపల్లి అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు... రాబోవు అన్ని ఎన్నికలలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు సీట్లు కేటాయించాలి అని మోత్కుపల్లి డిమాండ్ చేశారు. వాస్తవంగా మాది డిమాండ్ కాదు న్యాయం అని స్పష్టం చేశారు. ఏ రాజకీయ పార్టీలో కొనసాగుతున్న సరే.. తగిన సీట్ల కోసం ఆయా పార్టీల అధిష్టానం పై మాదిగలు తగిన ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు.

**మాదిగ మహాశక్తి**

ఆర్థిక సామాజిక రాజకీయ రంగాలలో మాదిగలకు అనాదిగా జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకొని.. మాదిగ జాతి సముద్ధరణ కోసం మాదిగ మహాశక్తి ఏర్పాటు చేశాను.. ప్రతి ఊరు నుంచి కనీసం 50 మంది మాదిగ సోదరులు కలిసి రావాలి... న్యాయం కోసం కలిసి నడుద్దాం.. కలిసి పోరాడుదాం.. కలిసి ఉద్యమిద్దాం.. కలిసి సమిష్టిగా రాజ్యాధికారం కోసం పాటుపడదాం అని నరసింహులు పిలుపునిచ్చారు. 30 ఏళ్లు శాసనసభ్యుడిగా, మంత్రిగా ప్రజాసేవలో నిమగ్నమయ్యాను.. నా జీవితం మాదిగల సముద్ధరణ కోసం అంకితం... బీసీ , ఎస్సీ, ఎస్టీ ,మైనార్టీ తదితర అన్ని వర్గాల కోసం తాను అవిశ్రాంతంగా రాష్ట్రంలో పలుచోట్ల సమావేశాలు, సభలు నిర్వహిస్తున్నాను.. తన ఉద్యమం ఎవరికి వ్యతిరేకం కాదు.. మాదిగ జాతి రాజ్యాధికారం కోసమే అని మోత్కుపల్లి నర్సింహులు స్పష్టం చేశారు. మాదిగలను ఏకం చేసి అన్ని సమస్యలకు పరిష్కారం చూపెట్టాలన్నదే తన ఆరాటం అన్నారు. మాదిగ మహాశక్తి రాష్ట్రంలో మాదిగలకు రాజ్యాధికారం ద క్కేవరకు కృషి చేస్తుందన్నారు.

## పేజ్ 1.. స్టేజ్ 1 పంప్ హౌస్ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే జి, మధుసూదన్ రెడ్డి వనపర్తి ఎమ్మెల్యే మేఘ రెడ్డి



**దేవరకద్ర, కొత్తకోట జులై 29 స్కై న్యూస్** దేవరకద్ర నియోజకవర్గం : కొత్తకోట, మదనపురం మండలాల శివార్లలోని భీమా ఫేజ్-1... స్టేజ్ -1 పంప్ హౌస్ నుండి అధికారులతో కలసి దిగువకు నీటిని విడుదల చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డిఅనంతరం ఎమ్మెల్యేలు జియంఆర్, మేఘా రెడ్డి మాట్లాడుతూ భీమా ఫేజ్ 1 పంప్ హౌస్ నుంచి దిగువకు నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఎగువన కర్ణాటక నుండి జూరాల వస్తున్న వరదను దృష్టిలో ఉంచుకొని, ఎప్పటికప్పుడు జూరాలలో ఉన్న నీటి మట్టాన్ని తెలుసుకుంటూ, రైతుల వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మొన్న కోయిల్ సాగర్ కు ఉంద్యాల పంప్ హౌస్ నుండి నీటిని విడుదల చేయడం జరిగిందని, నేడు భీమా ఫేజ్-1... స్టేజ్ -1 పంప్ హౌస్ నుండి దిగువకు నీటిని విడుదల చేయడం జరిగిందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం లో నిర్మించిన ప్రాజెక్టుల వల్లనే నేడు ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందుతుందని తెలియజేసారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామగుండం పోలీస్ కమిషనరేట్



**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జూలై 29(స్కై న్యూస్)**వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ వర్షాలతో నాలాల ప్రవహించే నీరు రోడ్డుపై రావడంతో ఆ ప్రాంతాలను పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్, మేయర్ మహంకాళి స్వామి, గోదావరిఖని ఏసిపి ఎం రమేష్ గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తో మల్కాపూర్, మెడికల్ కళాశాల, 5 ఇంక్లైన్, తదితర ప్రాంతలలో కలిసి వరదను పరిశీలించి జిల్లాలో భారీ వర్షాలతో వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని, అదేవిదంగా అధికారులకు అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, భారీ వర్షాలు కురుస్తుందున వల్ల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు నదుల వద్ద వరద ప్రవాహం అధికంగా ఉందని, వాటి వద్దకి ఎవరు వెళ్లవద్దన్నారు. గోదావరి, మానేరు నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, యువత వెళ్లకూడదన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు, యువకులు చెరువులు నది దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలంచడానికి జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ఎటువంటి సహాయం కావాలన్నా ఖుఅశ్రీ 100 కి లేదా స్థానిక పోలీస్ అధికారులకి ఫోన్ చేయాలని డీసీపీ సూచించారు.

## మహేశ్వరం నియోజకవర్గం TRS పార్టీ ఇంచార్జిగా కోల శ్రీనివాస్ నియామకం



**హైదరాబాద్, జూలై29 ;** తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధినేత్రి కల్వకుంట్ల కవిత మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన బడంగపేట నివాసి కోల శ్రీనివాస్ కు మహేశ్వరం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.కోల శ్రీనివాస్ బీసీ సామాజికవేత్తడ తెలంగాణ ఉద్యమ నేత,30 సంవత్సరాల రాజకీయ అనుభవం గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన నాయకుడు తెలంగాణ వీదీజ సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుల పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షులు **Lions Club District Chairman** ప్రజల్లో ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలు తీర్చే బహుజన బిడ్డ పార్టీ నిర్మాణానికి పూర్తి సమయం కేటాయించి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా కోల శ్రీనివాస్ మాట్లాడుతూ – “ఇన్ని ఉద్యమాలు చేసిన, జెండా పట్టే కార్యకర్తలన్నీ చూసిన ౧=ూ పార్టీలోనే ఎమ్మెల్యే స్థాయి పదవి ఒక సాధారణ కార్యకర్తకు రావడం కవితక్క గారికే సాధ్య మన్నారు. జాతీయ పార్టీలలో ఇలాంటి పదవులు, నామినేటెడ్ పోస్టులు కార్యకర్తలకు రావు. ప్రాంతీయ పార్టీగా ఏర్పడ్డ ౧=ూ పార్టీ రాబోయే రోజుల్లో కచ్చితంగా అధికారంలోకి వస్తుందని, కల్వకుంట్ల కవితక్క కచ్చితంగా ముఖ్యమంత్రి అవుతారు అని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అందరి పార్టీగాఈరోజు ఆదరణ పొందుతున్న ౧=ూ పార్టీ – లిఎక్కడ అన్యాయం ఉన్నా అక్కడ న్యాయం జరిగే వరకు పోరాడే పార్టీ” అని కోల శ్రీనివాస్ ం స్పష్టం చేశారు.

## గుడెబల్లూరు ఓంకారశ్రమంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**కృష్ణ జులై 29( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా కృష్ణా మండలం గూడబల్లూరు బై రోడ్ సమీపంలోని కృష్ణా నది తీరంలో ఉన్న శ్రీ ఓంకారశ్రమంలో బుధవారం గురు పౌర్ణమి మహోత్సవాలను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్ణయించారు. ఓంకార నందగిరి గురువును దర్శించుకొని ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా గురుపూజ పాదసేవ దానం భగవద్గీత పారాయణం భజనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరము గురువు శిశువుల శివ చైతన్యానంద రచించిన భక్తి గీతాల సిడిని ఆవిష్కరించారు. అదేవిధంగా శ్రీ ఓంకార శ్రమం అధికారిక వెబ్ సైట్ ను ప్రారంభించారు. ఓంకార నంద స్వామి మాట్లాడుతూ గురువు చూపే మార్గమే మనిషిని అజ్ఞానంతాకారం నుంచి జ్ఞాన వెలుగులోకి నడిపిస్తుందని అన్నారు. గురువు బోధలను ఆచరణలో పెట్టిన వారే నిజమైన భక్తి మార్గంలో ఉంటారని పేర్కొన్నారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఎల్కోటి నారాయణరెడ్డి. విఠోబా. శివన్న గౌడ్. భక్తులు పాల్గొన్నారు.

## ఉట్కూర్ లో భారీ కార్డెన్ సేర్చ్ 42 వాహనాలు సీజ్





**ఉట్కూరు జూలై 29 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల నియోజకవర్గంలో నేరాల నియంత్రణ. శాంతిభద్రతల. పరిరక్షణ. అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచడమే లక్ష్యంగా కార్డెన్ సేర్చ్ నిర్వహించినట్టు నారాయణపేట డిఎస్పి నలపు లింగయ్య తెలిపారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలో పోలీసులు భారీ క కార్డెన్ సేర్చ్ నిర్వహించారు. ప్రజల రక్షణ కోసమే ఈ తనిఖీలు చేపడుతున్నామని ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీలో భాగంగా మండల కేంద్రంలోని ప్రతి వీధిని జల్లెడ పట్టిన పోలీసులు. అనుమానస్పద వ్యక్తులను తనిఖీ చేశారు. చట్టబద్ధమైన పత్రాలు లేని 39 ద్విచక్ర వాహనాలు. రెండు ఆటోలు. ఒక టాక్టర్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్డెన్ సేర్చ్ నారాయణపేట సీఐ శివశంకర్. మక్తల్ సీఐ రామ్ లాల్. ఉట్కూర్ ఎస్సై రమేష్ తో పాటు మరో ఐదుగురు ఎస్ఐలు పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.ఖ

## కొండగట్టు గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్



**జగిత్యాల జిల్లా (జూలై29)**కొండగట్టు గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామి గిరిప్రదక్షిణలు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు.తెల్లవారుజాము నుండి వర్షం కురుస్తున్నప్పటికీ లెక్కచేయకుండా గిరి ప్రదక్షిణలు మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆంజనేయస్వామి చూడాలని కోరుకున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

వార్తాతరంగాలు

గురువారం 30 జూలై 2026

## దేవరకద్ర టీయూడబ్ల్యూజే (హెచ్-143) మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**దేవరకద్ర జూలై 29 (స్కై న్యూస్);** టీయూడబ్ల్యూజే (హెచ్–143) మహబూబ్‌నగర్ జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం దేవరకద్ర మండల నూతన కమిటీని జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వరంగల్ శివకుమార్, కో–కన్వీనర్ చింతకాయల వెంకటేష్ సమక్షంలో అధ్యక్షులుగా వేపూరి చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి -- మల్లికార్జున్ ఉపాధ్యక్షుడు -- ప్రణేష్ చారి సంయుక్త కార్యదర్శి -- నరేష్ ప్రచార కార్యదర్శి -- రఘువీర్ కుమార్ లను టి యు డబ్ల్యూ జే (హెచ్ 143) మహబూబ్ నగర్ జిల్లా హడక్ కమిటీ సమక్షంలో ఎన్నుకున్నారు.కార్యనిర్వాహక సభ్యులు గా ఎండి షఫీ, ఎల్లస్వామి, రాజశేఖర్, రమేష్, గోపనపల్లి శ్రీనివాస్, సంతోష్, పి. శ్రీనివాస్, సారంగపాణి, రాజేందర్ గౌడ్ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్దంగారి రవి కుమార్ తో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.అంతకుముందు ముందు అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో భూత్పూర్ మండల సభ్యులకు యూనియన్ సభ్యత్వ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన దేవరకద్ర మండల కమిటీకి అడ్‌హక్ కమిటీ నాయకులు అభినందనలు తెలియజేస్తూ, పాత్రికేయుల హక్కుల పరిరక్షణకు, సంఘ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

## నీట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను సన్మానించిన, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



**దేవరకద్ర, మదనాపూర్ జూలై 29 (స్కై న్యూస్);** నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థినులను దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు.మదనాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అనిమోని మాసన్న కుమార్తె సంజన నీట్‌లో 492 మార్కులు, అలాగే దంతనూరు గ్రామానికి చెందిన కుర్మన్న కుమార్తె మౌనిక 485 మార్కులు సాధించిన సందర్భంగా బుధవారం వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కష్టపడి చదివి జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరచడం ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులు ఇదే పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థినుల తల్లిదండ్రులను కూడా అభినందిస్తూ, వారి విజయానికి సహకరించిన కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

## పెండింగ్ వేతనాలు ఇప్పించాలని కోరుతూ ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పించిన ఫీల్డ్ అసిస్టెంట్లు



**పాపన్నపేట ,జూలై29:(వార్త తరంగాలు):** గతమూడు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ విబి జి రామ్ ఫీల్డ్ అసిస్టెంట్లు బుధ వారం నాడు పాపన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ విష్ణు వర్ధన్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు.ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ఎన్ఎంఎంఎస్ అటెండెన్స్ నమోదు బాధ్యతలతో పాటు మండల కేంద్రంలో జరిగే రివ్యూ సమావేశాలకు హాజర య్యేందుకు రవాణా ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతు న్నామన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమకు రావాల్సిన మూడు నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే అందజేయాలనీకోరారు.ఈ కార్యక్ర మంలో పాపన్నపేట మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు అంతు శ్రీనివాస్,శేఖర్,మంగమ్మ, రవి,రమేష్,సత్యం, హేమలత,లింగయ్య, సిద్ధిరాములు,సంగమేశ్వర్, యాదగిరి,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## పాపన్నపేట సాయిబాబా ఆలయంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**ఆలయ ప్రధాన అర్చకులు చెరువుపల్లి విశ్వనాథ శర్మ**





**పాపన్నపేట ,జూలై29(వార్త తరంగాలు):**మండల కేంద్రమైన పాపన్నపేట సాయిబాబా ఆలయంలో బుధవారం రోజు గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు చెరువుపల్లి విశ్వనాథ శర్మ,నవీన్ శర్మలు ఉదయాన్నే స్వామీ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు బాబాకు 108 లీటర్లతో పాలభిషేకం నిర్వహించారు.వేడుకల సందర్భంగా కొత్త లింగాయి పల్లి గ్రామానికి చెందిన కొత్త విశాంత్ గుప్తా దంపతులు అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు.వేడుకల సందర్భంగా పాపన్నపేట సాయి నామస్మరణతో మారు మ్రోగింది.ఈకార్యక్రమంలో పాపన్నపేట సర్పంచ్ లింగంపేట పావని గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగంపేట నరేందర్ గౌడ్,ఆలయ కమిటీ సభ్యులు రవీందర్ గౌడ్,కే.నరేందర్ రెడ్డి,బీకొండ రాములు నేత,దోమకొండ కిషన్ రెడ్డి,కొమ్మ కృష్ణ మూర్తి గుప్తా, బెజుగం విటలేశ్వర్ గుప్తా,ఆకుల శ్రీనివాస్, భూమాగౌడ్, ఉప్పరి వెంకటేశం, చీనూరి రాములు గుప్తా,విట వెంకటేశం గుప్తా,అచుకట్ల రమేష్, మిన్పూర్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో దళితులకు సమాన హక్కులు కల్పించాలి

**ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి**

**ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు దళితుల అభివృద్ధికే ఖర్చు చేయాలి**

**దళితుల సమస్యల పరిష్కారం కోసం డీహెచ్‌పీఎస్ నిరంతర పోరాటాలు**

**ఆగస్టు 3 కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేద్దాం**

**డి హెచ్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి**





**కొత్తగూడెం జూలై ( స్కై న్యూస్):** రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు దేశంలోని ప్రతి పౌరుడికి అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న దళితులకు గిరిజనులతో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. డి హెచ్ పి ఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక శేషగిరి భవన్ సిపిఐ కార్యాలయంలో సుంకిపాక ధర్మ అధ్యక్షతన మంగళవారం జరిగింది.ఈ సందర్భంగా సలిగంటి మాట్లాడుతూ దళితుల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కోసం ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన కోరారు.ఏజెన్సీ ప్రాంతాల్లో దశాబ్దాల కాలంగా గిరిజనులతో పాటు నివసిస్తున్న దళితులు ఇప్పటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, భూమి, ఉపాధితో పాటు అనేక అంశాల్లో వెనుకబాటుతనం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన అభివృద్ధి ఫలాలను పొందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో కూడా దళితులకు రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయడం కాలానుగుణ అవసరమని ఇందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మతం పేరుతో ఎస్సీలను ఇబ్బందులకు గురిచేయడం, వివక్షకు పాల్పడడం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని, కులానికి మతానికి అసలు సంబంధం లేదని మత విశ్వాసం వ్యక్తిగత హక్కు అని, దానిని ఆధారంగా చేసుకుని ఎస్సీ హోదా రద్దవుతుందని బెదిరింపులకు పాల్పడటం సరైనది కాదన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు దళితుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కేటాయించినవని, వాటిని ఇతర అవసరాలకు మళ్లించడం వల్ల దళితుల పురోగతికి తీవ్ర నష్టం కలుగుతోందని, ఎస్ సి సబ్ ప్లాన్ నిధులు దళితుల సమగ్రాభివృద్ధి కోసం వినియోగించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఆర్థిక స్వావలంబన ద్వారానే దళిత సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని,.దళితుల సమస్యల పరిష్కారం కోసం డీహెచ్‌పీఎస్ నిరంతరం ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహిస్తూ ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్తోందని తెలిపారు. దళితుల హక్కుల సాధన, పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆగస్టు 3న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సలిగంటి పిలుపునిచ్చారు. జిల్లాలోని దళితులు, యువత, మహిళలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దళితుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని, సమానత్వ సమాజ నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డి హెచ్ పి ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రత్రకుమారి జిల్లా అధ్యక్షులు దొంత మాల చెన్నయ్య నాయకులు మామిడాల ధనలక్ష్మి ఉరుసు రామకృష్ణ పాలమూరు శ్రీనివాస్ ఎర్రవెల్లి శంకర్ మండల రాజు ఇమ్మానియేల్ దార్ల లక్ష్మి చెరుకు సారయ్య తదితరులు పాల్గొన్నారు

# జూరాల కుడి కాలువ కు నీటిని విడుదల చేసిన గద్వాల ఎమ్మెల్యే



**జోగులాంబ గద్వాల, జూలై29(స్కై న్యూస్):** గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడికాలువ కు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించి సాగు నీరు విడుదల చేయడం జరిగినది.ఎమ్మెల్యే మాట్లాడుతు నీళ్లు విడుదల చేయడానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కి, నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి కి, జిల్లా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు వాకిటి శ్రీహరి సహచర ఎమ్మెల్యేలకు గద్వాల నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎలినోవా ప్రవాహంతో ఎక్కువ వర్షం పాత నమోదు కాలేదు వర్షం లేకపోవడం వల్ల నీళ్ల ఇబ్బంది ఉంది అయినా కూడా ప్రభుత్వం సీఎం ఉమ్మడి జిల్లా ప్రాంత వాసి కాబట్టి రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు కాబట్టి రైతులకు పంటలు వేసుకునే నాట్లు వేసుకునే సమయంలో కొంత మేరకు నీళ్లటిని విడుదల చేయడం జరుగుతుంది. 30 లక్షల ఎకరాలకు నీళ్లు అందించడం జరుగుతుందని తెలిపారు.రైతులు నీటిని వృధా చేయకుండా వినియోగించుకోవాలి రెండు పంటలకు ఉపయోగించుకోవాలని దశలవారీగా నీటిని వినియోగించుకోవాలని సూచించారు.నారాయణపూర్ డ్యామ్ నుండి డ్యామ్ గేట్లు ఎత్తి దిగువన జూరాలకు నీటిని విడుదల చేయనున్నారు. ఎలినోవా ప్రభావం రైతులు వరి పంటలు వేయకుండా నీటిని తక్కువగా ఉపయోగపడే పంటలను వేయాలి శాస్త్రవేత్తలు సూచించే పంటలను వెయ్యాలి అదేవిధంగా అగ్రికల్చర్ అధికారులు సూచించే పంటలను వేసి ఆకుకూరలు పండ్లు కూరగాయలు వంటి పంటలను పండించాలని అప్పుడే నీటి ఎక్కువ వృధా కాకుండా సరిపడా నీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. రైతులు కూడా వ్యవసాయ అధికారులకు సహకరించాలి అప్పుడే నీట్లు ఇబ్బంది లేకుండా ఉంటుందని పేర్కొన్నారు.ఏ ప్రభుత్వాలు వచ్చిన రైతుల సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుంది. కావున రైతులు ఇబ్బందిలు అపోహాలు చెందవద్దండి అన్ని విధాలుగా ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.నడిగడ్డ లో ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామన్నారు. జూరాలకు వస్తున్న వరద నీటిని దృష్టిలో ఉంచుకుని నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా ర్యాలంపాడు, గూడెందొడ్డి పంపు మోటార్లు ఇప్పటికే ఆన్ చేశామని, రిజర్వాయర్ల ద్వార కాలువలకు సాగు నీరు వదలడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు రైతులు, అధికారులు, కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఖ

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్

**రానున్న 36 గంటల్లో భారీ వర్షాల అవకాశం**

**అన్ని శాఖల అధికారులు కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలి**



**కొత్త గూడెం జూలై 29( స్కై న్యూస్ ):**రానున్న 36 గంటల్లో వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. భారీ వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి, భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.భారీ వర్షాల హెచ్చరికల దృష్ట్యా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమ కార్యస్థానాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వరద ప్రవాహం సమయంలో నదులు, వాగులు, కాలువలు, చెరువులు వంటి జలవనరుల వద్దకు వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటి ప్రవాహాన్ని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని సూచించారు. అలాగే రహదారులు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.భారీ వర్షాల కారణంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షిత తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ అన్నారు .గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రసవ సమయం సమీపించిన గర్భిణీలను ముందుగానే సమీప ఆసుపత్రులు లేదా గర్భిణీ వసతి కేంద్రాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

# జూరాల ప్రాజెక్టుకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీ చిట్టెం రామ్మోహన్ రెడ్డి



**మక్తల్ జూలై 29( స్కై న్యూస్):**రైతుల కోసం నీటి విడుదల కోరుతూ బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ధర్నాకు సిద్ధమవుతున్నారని తెలిసిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడిగా జూరాల ఎడమ కాలువలో నీటిని విడుదల చేయడం ప్రారంభించడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే శ్రీ చిట్టెం రామన్న గారు తీవ్రంగా మండిపడ్డారు.జూరాల ప్రాజెక్టుకు చేరుకున్న ఆయన అధికారులను నిలదీస్తూ… “మూడు రోజులుగా ప్రాజెక్టుకు నీటి ప్రవాహం వస్తున్నా రైతులకు ఎందుకు నీళ్లు ఇవ్వలేదు? బీఆర్ఎస్ ఉద్యమం ప్రకటించిన తర్వాతే రైతులు గుర్తుకు వచ్చారా? రైతుల కష్టాలు కనిపించలేదా? ధర్నా భయంతో తీసుకున్న నిర్ణయం రైతుల పట్ల చిత్తశుద్ధి కాదు” అని ప్రశ్నించారు.అలాగే “భీమా ప్రాజెక్టుకు నీటి విడుదల ఎందుకు నిలిపివేశారు? వరదలు వచ్చినప్పుడే భీమాకు నీళ్లు వదలాలనే ఆలోచన రైతుల ప్రయోజనాలకు పూర్తిగా విరుద్ధం. సాగునీరు రైతుల హక్కు… ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదు” అని ఆగ్రహం వ్యక్తం చేశారు.“ముందుగా జూరాల ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించి న్యాయం చేయాలి. రైతులు రోడ్లపైకి వస్తేనే ప్రభుత్వం స్పందించే పరిస్థితి రావడం దురదృష్టకరం. రైతుల జీవితాలతో రాజకీయాలు చేయడం మానుకుని వెంటనే అన్ని కాలువలకు నీటి విడుదల చేపట్టాలి. లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి మరింత ఉధృతంగా పోరాటం చేస్తాం” అని హెచ్చరించారు.

## కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని
# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట జూలై 29: (స్కైన్యూస్)**నారాయణపేట మండలం లోని కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక బుధవా రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళా వార్డు, ప్రయోగ శాల, ఫార్మసీ, టీకాల నిల్వ గది, వ్యాక్సినేషన్ విభాగాలను పరిశీలించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీ విధుల్లో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, సంబంధిత అధికారులను వివరణ కోరారు. నారాయణపేటలో జరుగుతున్న సమావేశానికి హాజరైనట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు.మహిళా వార్డులో చికిత్స పొందుతున్న గర్భిణితో కలెక్టర్ మాట్లాడి, ఆమె ఆరోగ్య పరీక్షల నివేదికలను పరిశీలించారు. గర్భిణి రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించిన కలెక్టర్, వెంటనే అప్పక్‌పల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి, గర్భిణికి అవసరమైన టీఫా స్కానింగ్ పరీక్షలు నిర్వహించి, నివేదికను మెడికల్ ఆఫీసర్ ద్వారా తనకు పంపించాలని సూచించారు.ఆరోగ్య కేంద్రంలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు. గతంలో బయోమెడికల్ వ్యర్థాల సేకరణకు వాహనం వచ్చేదని, ప్రస్తుతం రావడం లేదని వైద్య సిబ్బంది తెలిపారు. అలాగే విద్యుత్ సరఫరా లేకపోవడంతో వ్యాక్సినేషన్ సేవలకు అంతరాయం ఏర్పడుతున్నట్లు వివరించారు.దీనిపై స్పందించిన కలెక్టర్, బయోమెడికల్ వ్యర్థాల సేకరణ వాహనం ఎందుకు రావడం లేదని డీఎంఅండ్‌హెచ్‌వోను ప్రశ్నించారు. సంబంధిత ఏజెన్సీకి వెంటనే నోటీసు జారీ చేయాలని, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బయోమెడికల్ వ్యర్థాలను క్రమం తప్పకుండా సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈకి సూచించారు.



వెంటనే డీఈఈను ఆరోగ్య కేంద్రానికి పంపించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శన**

అనంతరం కోటకొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడితో పాటు మరో ఉపాధ్యాయుడు జాజాపూర్‌లో జరుగుతున్న శిక్షణకు హాజరయ్యారని, ఒక ఉపాధ్యాయుడు సెలవులో ఉండగా, మరో ఉపాధ్యాయురాలు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైనట్లు ఉపాధ్యాయులు వివరించారు.ఆరో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి, వారి అభ్యాస సామర్థ్యాలను పరిశీలించి అభినందించారు. అనంతరం డైనింగ్ హాల్‌ను పరిశీలించి, పదో తరగతి విద్యార్థులతో భౌతిక శాస్త్రం పాఠ్యాంశానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు.గత విద్యా సంవత్సరంలాగే ఈసారి కూడా పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించే లక్ష్యంతో చదవాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ప్రోత్సహించారు. తరగతి గదిలోని విద్యార్థులతో మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న



విద్యార్థులతో పోటీ ఉంటుందని గుర్తుంచుకుని పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను అదే రోజు పునశ్చరణ చేస్తే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు నిరాశ చెందకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు ఆర్థిక స్వావలంబన సాధించి, తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవాలని ప్రోత్సహించారు.చివరగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే వంటగది వద్ద అపరిశుభ్రతను గమనించి శుభ్రత పాటించాలని సూచించారు. ఎంపీడీవో పాఠశాలను తరచూ సందర్శించాలని ఆదేశించడంతో పాటు, వంటగదిలో తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

**సిల్క్ చీరలను పరిశీలించిన కలెక్టర్**

అనంతరం గ్రామంలోని చేనేత కార్మికుడి ఇంటిని సందర్శించిన కలెక్టర్, అక్కడ తయారవుతున్న సిల్క్ చీరలను పరిశీలించారు. చీరల తయారీకి అవసరమైన ముడిసరుకు, ఉత్పత్తి వ్యయం, మార్కెటింగ్, విక్రయాల వివరాలను గ్రామానికి చెందిన మాస్టర్ వీవర్ పడాకుల శ్రీనివాస్ కలెక్టర్‌కు వివరించారు.ఖ

## యువత రక్తదానం చేసి
# ప్రాణదాతలుగా నిలవాలి

**- కలెక్టర్ ప్రియాంక**




**నారాయణపేట జూలై 29: (స్కైన్యూస్)** యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాత లుగా నిలవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపు నిచ్చారు.గురు పౌర్ణిమ సందర్భంగా నారాయణ పేట జిల్లా కేంద్రంలోని షిరిడి సాయిబాబా మందిర ఆవరణలో స్నేహ మిత్ర మండలి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరా న్ని జిల్లా కలెక్టర్ ప్రారంభిం చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా అవస రమైన వారికి సకాలంలో రక్తం అందించడంతోపాటు, రక్తదాత ఆరోగ్యానికి కూడా ప్రయోజనం చేకూరుతుం దని తెలిపారు. ప్రతి సంవ త్సరం ఈ తరహా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ సామాజిక సేవలో భాగస్వా ములవుతున్న స్నేహ మిత్ర మండలి నిర్వాహకులను ఆమె అభినందించారు.అనంతరం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ వినీత్ శిబిరాన్ని సందర్శిం చి మాట్లాడారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సమాజా నికి సేవ చేయడంతో పాటు ఆరోగ్యపరమైన ప్రయోజ నాలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు. రక్తదాతలను, శిబిర నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందిం చారు.ఈ సందర్భంగా స్నేహ మిత్ర మండలి సభ్యులు కలెక్టర్ ప్రియాంక, ఎస్పి వినీత్ ను శాలువాల తో సన్మానించారు.ఈ రక్తదాన శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మంజుల రెడ్డి, ఆర్డీఓ రమేష్ సందర్శించారు.

## కేంద్ర నిర్లక్ష్యం వల్లే
# అమలుకు నోచుకోని మహిళా బిల్లు

**ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోట కల్పించాలి.**

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు రేణుక.**



**నాగర్ కర్నూల్ జులై 29( స్కై న్యూస్)** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యం వల్లే 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు కావడం లేదని వెంటనే ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కోటాను అమలు చేసి మహిళా బిల్లును అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు సిహెచ్ రేణుక డిమాండ్ చేశారు బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కాళ్ల నిరంజన్ అధ్యక్షత వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశాబ్దాలుగా మహిళా సంఘాలు రిజర్వేషన్ అమలు చేయాలని నిర్వహించిన పోరాటాల ఫలితంగానే కేంద్రం దిగివచ్చి బిల్లును ఆమోదించారని కానీ నేటికీ అమలు చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. రాజకీయాలలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఎస్టి ఎస్సీ బీసీ మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. మహిళల భద్రత విద్య ఆరోగ్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని లేదంటే మహిళలను చైతన్యం చేసి రాష్ట్ర వ్యాప్త పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ సమావేశంలో మహిళా నాయకులు దాసరి భాగ్యమ్మ శివలీల రాములమ్మ కురువమ్మ మంగమ్మ పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు

# నిధుల విడుదలలో నిర్లక్ష్యం వీడాలి

**బీజేవైఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ**

**నాగర్ కర్నూల్ జులై 29 (స్కై న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జిల్లా అధ్యక్షులు దన్నోజు నరేష్ చారి హెచ్చరించారు బుధవారం జిల్లా కేంద్రంలోని పలు కళాశాలలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం పాలెం గ్రామంలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాల మరియు డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఫీజుల బకాయి బీజేపీ లడాయి పేరుతో కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థులకు ఇచ్చిన హామీలను కూడా అమలు



చేయడం లేదని స్కూటీలు లాప్టాప్ ల హామీ ఏమైంది అని ప్రశ్నించారు వెంటనే నిధులను విడుదల చేయకపోతే విద్యార్థుల సత్తా చాటుతామని హెచ్చరించారు. విద్యార్థుల బకాయిల చెల్లింపుకు 15 వేల కోట్ల నిధులను విడుదల చేయాలని ఉద్యోగ ఉపాధి అవకాశాలను పెంపొందించాలని ఆయన కోరారు కార్యక్రమంలో మైనార్టీ మోర్చా జిల్లా



అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ బీజేవైఎం రాష్ట్ర నాయకులు విజయేందర్ రెడ్డి జిల్లా నాయకులు నిశ్వంత్ విద్య రవి సంతోష్ పరమేష్ ప్రశాంత్ ప్రవీణ్ జయప్రకాష్ ఆనంద్ సింగ్ వెంకటేష్ సాయి అరవింద్ భరత్ శివ విష్ణు శంకర్ తదితరులు పాల్గొన్నారు

## సామాజిక బాధ్యతతో
# మాదకద్రవ్యాలను అరికట్టాలి..



**అంతర్జాలం జూదంతో అరిష్టాలు: ఎస్సై రాము యాదవ్**

**నాగర్ కర్నూల్ తాడూర్ జులై 29 (స్కైన్యూస్)** విద్యార్థి యువత సామాజిక బాధ్యతతో మాదకద్రవ్యాలను అరికట్టి గంజాయి డ్రగ్స్ విక్రయించే వారిపై సేవించే వారి వివరాలను పోలీసులకు అందించాలని తాడూరు ఎస్సై రాము యాదవ్ సూచించారు బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి డ్రగ్స్ కు ఆకర్షితులు కావడం వల్ల జీవితాలు నిర్వీర్యం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు అనేక ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. డ్రగ్స్ గంజాయికి అలవాటు పడితే మానసిక రోగంతో వారు చేసే చర్యలు వారికే అర్థం కావని వీరి వల్ల సమాజంలో అశాంతి నెలకొంటుందని అన్నారు కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజంలో పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలని సూచించారు. అంతర్జాలం ద్వారా జూదం ఆడటం వల్ల ఎందరో తమ ప్రాణాలను సైతం కోల్పోయారని వివరించారు డ్రగ్స్ గంజాయి విక్రయించే వారి వివరాలను 1930 కి వివరించాలని తెలిపారు సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువత జీవితాలను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు బెట్టింగ్ గ్యాప్ లను నిషేధించాలని. మహిళపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివశంకర్ నాగపూర్ మధు జిల్లా ఉపాధ్యక్షులు కురుమయ్య భీముడు రవి ఆనంద్ శేఖర్ పవన్ తో పాటు ఆధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

## సత్యసాయి మందిరంలో
# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు..


**స్వామివారికి విశేష ద్రవ్య అభిషేక పూజలు అర్చనలు**

**సత్య సాయి సేవా సమితి కన్వీనర్ కే. బాలరాజ్**

**నాగర్ కర్నూల్ జూలై 29( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రము పక్కనగల సత్యసాయి మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం నాడు స్వామి వారికి విశేష ద్రవ్యాలతో అభిషేక పూజలు, అర్చనలు అష్టోత్తర పూజలు శాస్త్రోక్తంగా ఆలయ ప్రధాన అర్చకులు వావిలాల రాజశేఖర్ శర్మచే నిర్వహించినట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కే. బాలరాజ్ తెలిపారు.తెల్లవారుజామున భక్తులచే సామూహికంగా అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం నగర సంకీర్తన, సామూహికంగా ఆలయంలో ప్రత్యేక సాయి భక్తులచే భజనలు చేశారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు తెల్లవారుజామున నుండి ప్రదోషకాలం వరకు స్వామివారిని దర్శించుకొని, అర్చనలు అష్టోత్తర నామావళి సామూహికంగా చేశారు. గురు పౌర్ణమి నాడు గురువులను దర్శించుకుంటే




విశేష ఫలితం ఉంటుందని, గోచార రీత్యా గురు బలం పెరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు వావిలాల రాజశేఖర్ శర్మ తెలిపారు. సాయంత్రం సమయంలో సాయి భక్తులచే ప్రత్యేక భజనలు, మహా మంగళహారతి సమర్పణ చేశారు. అనంతరం పాల్గొన్న భక్తులందరికీ తీర్థ ప్రసాదాల




పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రశాంతి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు హాకిం విశ్వ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య, సత్య సాయి భజన మండలి, యువత, సేవాదళ్, మహిళా కన్వీనర్లు, బాలవికాస్ గురువులు, బాలవికాస్ విద్యార్థులు, భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవుడి ఆహారం శాకాహారమే!

**శాఖాహార ర్యాలీలో బంగ్లా ఆంజనేయరెడ్డి సరిత!**

**నారాయణపేట జూలై 29 (స్కైన్యూస్):** మానవుడి శరీరం,దంత, పేగు, జీర్ణ వ్యవస్థ, కేవలం శాఖాహారం మాత్రమే తినడానికి అనువుగా నిర్మితమై ఉన్నదని ధ్యాన శాకాహార ప్రచార నిర్వాహకులు బంగ్లా ఆంజనేయరెడ్డి, సరిత, సుప్రజ అన్నారు. మాంసాహారం వల్ల మనసు, శరీరము అనారోగ్యం పాలవుతుందని వారు అన్నారు. స్థానిక పిరమిడ్ మాస్టర్ల ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం నాడు పట్టణ పురవీధుల గుండా శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లలో పలువురు ధ్యానం ద్వారా శాఖాహార భోజనం ద్వారా తాము పొందిన లాభాల గురించి వివరించారు. మాంసాహారం వద్దు- శాకాహారమే ముద్దు, జీవహింస మహాపాపం, గాంధీజీ అంబేద్కర్ బుద్ధుడి మార్గం అంత శాకాహార మార్గం అని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ పురవీధుల గుండా శాకాహార ర్యాలీ నిర్వహించారు. యోగులు,దేవతలు,ఋషుల మార్గం అంతా శాఖాహారం అని, భగవద్గీత వేదాలు



ఉపనిషత్తులు, బైబిల్, ఖురాన్, శాకాహారం తినాలని మాత్రమే బోధించాయని, వారు వివరించారు. శాఖాహారం, ధ్యానం మనసును ఆరోగ్యాన్ని ప్రశాంతతో జీవించడానికి ఉపయోగపడతాయని వారు అన్నారు. జీవహింస చేయడం వల్ల జంతువులను బలి ఇవ్వడం వల్ల రక్త ప్రసరణ వల్ల ఈ భూమిపై ఒక నెగిటివ్ ఫోర్స్ ఏర్పడుతుందని వారు అన్నారు. ఈ భూమాతను ప్రక్షాళన చేస్తూ ప్రతి ఇల్లు శాంతిగా సుఖంగా ఉండడానికి శాకాహార జీవన విధానాన్ని కొనసాగించాలని వారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుప్రజ జయంత్, ప్రవీణ్ శైలజ, వెంకటేష్ శైలజ ప్రవీణ్,, రాంరెడ్డి,,, బాల్ రెడ్డి , వెంకట్ రెడ్డి బాలరాజ్ మార్కెట్ శ్రీను, భీమేష్, మల్లేశ్వర్ రెడ్డి,వెంకటేష్ నరేష్ రవి మాణిక్యప్ప, శ్రీదేవి,లక్ష్మి, సంగం నరసింహులు ఆర్య మహాదేవ్, కొంకలి వెంకట్ రెడ్డి, మమత, బాలమ్మ, శారద ,తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం

**జిల్లా విద్యాధికారి శ్రీమతి బి. వాసంతి**





**కొత్త గూడెం జూలై 29( స్కై న్యూస్):**జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యా శిక్షణా కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆనందఖని ,కొత్తగూడెం నందు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలను పెంపొందించడంలో విద్యార్థులకు ,ఉపాధ్యాయులకు మధ్య వారు వారధిలా వ్యవహరించాలని సూచించారు . తరగతిలో వెనుకబడిన విద్యార్థుల కోసం అమలు చేస్తున్న **LIP (Learning Improvement Programme)** కార్యక్రమాన్ని , ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించి, పిల్లల్లో పఠనా సామర్థ్యాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రతి రోజు కనీసం ఇద్దరు ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి, లోటుపాట్లను గుర్తించి వారికి సూచనలు ఇవ్వడం ద్వారా బోధన నాణ్యతను మెరుగుపరచాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో లిప్ ద్వారా లెర్నింగ్ అవుట్‌కమ్స్ సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, యుడైస్ ప్లస్ లో పాఠశాలల సరైన డేటా నమోదు చేయడం ద్వారా, వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాకు పి జీ ఐ లో మెరుగైన ర్యాంక్ సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యాశాఖ సూచించిన అన్ని కార్యక్రమాలను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ప్రధానోపాధ్యాయులను కోరారు. ఇదే సందర్భంలో ఫిజికల్ డైరెక్టర్ల శిక్షణ కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తూ, విద్యార్థుల శారీరక మానసిక అభివృద్ధిలో ఫిజికల్ డైరెక్టర్ల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ, వారికి సరైన మార్గదర్శకత్వం ఇవ్వడం వారి బాధ్యతగా పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్‌ను సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా, ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. ఇదే సందర్భంగా సమ్మిళిత విద్య శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న స్పెషల్ ఎడ్యుకేటర్లు/ఐఏర్పి కు కూడా పలు సూచనలు చేశారు. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులను గుర్తించి వారికి వ్యక్తిగత విద్యా ప్రణాళికలు రూపొందించాలని, ప్రతి విద్యార్థి పురోగతిని నెలవారీగా ట్రాక్ చేయాలని, తల్లిదండ్రులతో నిరంతర సమన్వయంతో దివ్యాంగ విద్యార్థులకు నైతిక మద్దతును అందించాలని సూచించారు. సహాయక పరికరాల వినియోగంపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి. సాధారణ తరగతులతో సమన్వయం చేసి సమ్మిళిత విద్యను బలోపేతం చేయాలి. పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి దివ్యాంగ పిల్లలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు .ముఖ్యంగా ఈ శిక్షణా కార్యక్రమాల ద్వారా ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు స్పెషల్ ఎడ్యుకేటర్లు, లు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించి, జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి మాధవరావు, కమ్యూనిటి మొబిలైజేషన్ అధికారి యస్. కె. సైదులు, కోర్సు కో ఆర్డినేటర్ లు జుంకిలాల్, బాలాజీ , ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు స్పెషల్ ఎడ్యుకేటర్లు,సమ్మిళిత విద్యా రిసోర్స్ పర్సన్ లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం**

**పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి**

**ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధుల కేటాయింపు**

**కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**

**రూ.59లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన**

**బర్మా క్యాంపులో కార్మిక సంక్షేమ భవన్'కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**



**కొత్తగూడెం జూలై 29(స్కై న్యూస్) :** అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో బుధవారం రూ. 59 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా ఎస్బిబి నగర్ 14వ డివిజన్, పాత కొత్తగూడెం 12వ డివిజన్లో, 10వ డివిజన్ బూడిదగడ్డలో, 58వ డివిజన్ హనుమాన్ బస్తీలో, 49వ డివిజన్ హనుమాన్ బస్తీలో చేపట్టే సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు నిర్వహించారు. అనంతరం 24వ డివిజన్ బర్మా క్యాంపు ఏరియాలో రూ. 15లక్షల వ్యయంతో నిర్మించనున్న కార్మిక సంక్షమ భవన్కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో ఏర్పాటు చేసిన శంకుస్థాపన సభల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి పారుదల, సీసీ రోడ్ల సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, సంక్షేమ భవనాల నిర్మాణంతో ప్రజల రవాణా సౌకర్యాలు, వసతులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు, పర్యవేక్షణ అధికారులు పనుల్లో ఎక్కడా అలసత్వం వహించకుండా, పారదర్శకతతో నాణ్యమైన ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత వ్యవధిలోనే పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. స్థానిక డివిజన్ల ప్రజలు అభివృద్ధి పనులను పరిశీలిస్తూ తగిన సూచనలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, కార్పొరేటర్లు కూరపాటి సుధాకర్, పొలమూరి ధనలక్ష్మి, బోయిన విజయ్ కుమార్, సుప్రియ, నాయకులు ఎస్ కె ఫహీమ్, భూక్యా శ్రీనివాస్, యూసుఫ్, గోపికృష్ణ, గుత్తుల శ్రీను, ఖయూమ్, మండల రాజు, రాజేందర్, వాడే రాములు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## దాదనపల్లి, అంకెన్‌పల్లి పునరావాసాలకు భూసేకరణ ప్రక్రియలో కీలక ముందడుగు



**నారాయణపేట జూలై 29: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా, మక్తల్ మండల పరిధిలోని పీజేపీ ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలైనదాదనపల్లి,అంకెన్‌పల్లి గ్రామాల నిర్వాసితు లకు పునరావాసం కల్పించేందుకు అనుగొండ గ్రామ శివారులో ఏర్పాటు చేయనున్న కేంద్రాలకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందనీ అదనపు కలెక్టర్ శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా దాదనపల్లి ఆర్ అండ్ ఆర్ సెంటర్‌కు 60.05 గుంటలు, అంకెన్‌ప ల్లి ఆర్ ఆర్ అండ్ ఆర్ సెంటర్‌కు 67.19 గుంటల భూసేకరణకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్లు ఇప్పటికే జారీ చేయడం జరిగిందన్నారు. ఆర్ అండ్ ఆర్ సెంటర్ల కోసం భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించి సోషియో ఎకనామిక్ సర్వే నిర్వహించడము జరిగిందన్నారు. ఆ యొక్క సెస్ సర్వే రిపోర్ట్ ను ఈ రోజు దాదనపల్లి, అంకెన్‌పల్లి గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ గ్రామసభల్లో సెస్ సర్వే వివరాలను గ్రామసభ ముందుంచి, సభ్యుల ఆమోదంతో తీర్మానాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎల్‌ఐఎస్‌పీ యూనిట్-1, మక్తల్ శ్ ఎల్. రాజేందర్ గౌడ్,, తహసీల్దార్ మక్తల్ సతీష్ , దాదనపల్లి, అంకెన్‌పల్లి గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ అధికారులు, సాగునీటి శాఖ అధికారులు, భూములు కోల్పోయిన రైతులు , గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు వెంటనే సంబంధిత బిఎల్‌ఓ లకు అందజేయాలి

**ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్.. రిజ్వాన్ భాషా షేక్**



**జోగులాంబ గద్వాల, జూలై29(స్కై న్యూస్):**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్.) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఓటరు ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని, జిల్లాలో ఇప్పటికే దాదాపు 89 శాతం పూర్తయిందని, మిగిలిన 11 శాతాన్ని కూడా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) సమన్వయంతో పూర్తి చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ అనంతరం రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని, ఇంకా మిగిలిన 11 శాతం ఓటర్లలో కొందరి పేర్లు రెండు ప్రాంతాల్లో ఉండే అవకాశం ఉందని, తమ ఓటు ఎక్కడ కొనసాగించాలనే సందిగ్ధంలో వారు ఉండవచ్చని పేర్కొన్నారు. ఒక ఓటరుకు ఒకే చోట మాత్రమే ఓటు హక్కు ఉండాలని, రెండు చోట్ల ఓటరు పేర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. ఓటర్లు తమ ఓటు ఎక్కడ కొనసాగించాలనుకుంటున్నారో నిర్ణయించుకుని, మరో ప్రాంతంలోని ఓటును రద్దు చేయించుకునేందుకు సంబంధిత బీఎల్‌వోకు సమాచారం అందించాలన్నారు. ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల పేర్లు ముసాయిద ఓటర్ల జాబితాలో నమోదు కావని, వారు తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. కావున అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని నిర్ణీత సమయంలో బిఎల్‌ఓ లకు సమర్పించాలని సూచించారు. రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్‌ఏలు తమ పరిధిలో ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించని ఓటర్లకు అవగాహన కల్పించి, వారు త్వరితగతిన పత్రాలు పూర్తి చేసి అందజేసేలా చర్యలు తీసుకోని అధికారులకు సహకరించాలన్నారు.

## హెచ్ పీవీ వ్యాక్సిన్ పై ఎలాంటి ఆపోహాలు వద్దు

**తెల్కపల్లి జూలై 29(స్కై న్యూస్):**14 ఏళ్లు నిండిన బాలికలు నిరభ్యంతరంగా తీసుకోవచ్చు,తెలకపల్లిలో వ్యాక్సిన్ పంపిణీ పరిశీలించిన రాష్ట్ర బృందం హెచ్ పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం మూలంగా ఎలాంటి సమస్యలు ఉండవని, గత 20 ఏళ్లుగా ఈ వ్యాక్సిన్ వాడుకలో ఉన్నదేనని జేడీ చైల్డ్ హెల్త్ ఇమ్యునైజేషన్ రాష్ట్ర బృందం డాక్టర్ పృథ్వీ, స్టాటిస్టికల్ ఆఫీసర్ డేవిడ్ అన్నారు. బుధవారం తెల్కపల్లి మండలకేంద్రంలో కేకే రెడ్డి పాఠశాలలో ఏర్పాటు చేసిన హెచ్ పీవీ వ్యాక్సిన్ పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సురేష్ బాబుతో కలిసి సందర్శించి విద్యార్థులను అభినందించారు. 14 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ హెచ్ పీవీ టీకా తీసుకోవడం మూలంగా గర్భాశయ క్యాన్సర్ ను సమర్థవంతంగా నివారించవచ్చని అన్నారు. హెచ్ పీవీ వ్యాక్సిన్ మీద అపోహలు తొలగించి, టీకాలు వేసుకునేలా ప్రోత్సహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. 41 మంది విద్యార్థినులకు టీకాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రాజేశ్వర్ , జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, కోల్డ్ చైన్ ఇంచార్జ దివ్య, డాక్టర్ అరవింద్, సూపర్ వైజర్లు వీర్ పాల్, యశోద, హెల్త్ అసిస్టెంట్ సందీప్ రెడ్డి, ఏఎన్ఎంలు కవిత, శాంత, శ్రీలత, ఫార్మాసిస్ట్ సాయిరాం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైద్రాబాద్ జిల్లాలో ప్రతి పాఠశాలలో స్కౌట్స్ , గైడ్ కెప్టెన్ యూనిట్

**హైద్రాబాద్ జిల్లా విద్యాధికారి యాదయ్య**



హైద్రాబాద్ జిల్లాలో ప్రతి పాఠశాలలో స్కౌట్స్ , గైడ్ కెప్టెన్ యూనిట్ ఏర్పాటు చేయాలని హైద్రాబాద్ జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. నేడు హైద్రాబాద్ జిల్లా విద్యాధికారి యాదయ్యనుజిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ తరుపున సెక్రటరీ వి. లక్ష్మణ్ నాయక్, మరియు ఆర్గనైజింగ్ కమిషనర్ స్కౌట్స్ వి. రాములు నాయక్ , గైడ్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ.అనిత లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు . హైద్రాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాల ఉపాధ్యాయులు స్కౌట్స్ మాస్టర్ గా, గైడ్ కెప్టెన్ గా శిక్షణా పూర్తి చేసుకున్నందుకు సంతోషంగా మరియు ఆనందంగానూ ఉన్నది ,దీనికి ముఖ్యంగా మన జిల్లా విద్యాధికారిమరియు స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ చీఫ్ కమిషనర్ గా ఉన్నా యాదయ్య అనుమతిని ఇచ్చి వారికి ఆన్ డ్యూటీ మీద వారం రోజులపాటు శిక్షణా తీసుకో వాడానికి అనుమతిని ఇచ్చినందుకు దాన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో జరగబోయే కార్యక్రమాలకు సహాయ సహకారములు అందించవలసినది గా కోరగా తప్పకుండా ప్రోత్సహిస్తామని సానుకూలంగా స్పందించడం మంచి శుభపరిణామము గా భావిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. హైద్రాబాద్ జిల్లాలో ప్రతి పాఠశాలలో ఈ యూనిట్ ను ప్రారంభించాలని గట్టి సంకల్పముతో మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, మరియు రాష్ట్ర స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ సెక్రటరీ అయినా డాక్టర్ శ్ నవీన్ నికోలస్ స పర్యవేక్షణలో ఈ ఉద్యమము శరవేగంగా దినదినాభి వజిల్ చెందుతుందనడానికి చాలా గర్వంగా,చాల ఉత్సహంగా ఉంది,వారికి మన జిల్మ తరుపున ప్రత్యేక హృదయభి వందనములు,వారి ఆశయాలకు అనుగుణంగా మనమందరము ఈ ఉద్యమాన్ని ముందుండి మొదటివరుసలో చురుకుగా పాల్గొందామని ఈ సందర్భంగా అందరిని వేడుకుంటున్నాను , మీ సహాయ సహాకారములు ఇలాగే కొనసాగించాలని కోరుకుంటూ , ఈ నెలలో ట్రైనింగ్ పూర్తి చేసుకున్నవా రందరికీ హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ, మీ మీ పాఠశాలలో కొత్త యూనిట్ ను అతి త్వరలో ప్రారంభించాలనీ ఆశిస్తున్నాను ఈ విషయములో మీకెలాంటి సందేహాలున్న కానీ మాకు సంప్రదించగలరనిమనవి చేసుకుంటున్నాము, ముందుగా బాలభటులను సెలెక్ట్ చేసుగోలరనీ వారికి బేసిక్ ,ప్రారంభించండఆశిస్తున్న?స్టేట్ ఆఫీస్ దోమలగూడ లో హయ్యర్ అధికారులను కలిసి మన జిల్లా నూతనంగా ఏర్పడిన స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ సులభంగా కార్యక్రమాలు , శిక్షణా తీసుకోవడానికి మరియు పాలనాపరంగా ఇబ్బందులు ఉన్నందుకు మనకు ఒక మైదానమును మరియు ఆఫీస్ ను ఇప్పియమని కోరడం జరిగింది ,వారి కూడా సానుకూలంగా స్పందించడం మరియు అక్కడే వారి వద్ద ఉన్న రూమ్స్ ను ఉపయోగించుకొని చెప్పడం జరిగింది అందు వారికి ప్రత్యేక హృదయ పూర్వక నమస్కారములు తెలియచేస్తున్నాను,ముఖ్యంగా సోమనాథ్ శర్మ , రాజగోపాల్ కి, వెంకటరెడ్డి ,జాన్ శ్యామ్యుల్ , నమస్ అందరి ప్రోత్సాహంతో , సూచనలతో,సహకారముతో హైద్రాబాద్ జిల్లా లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగిస్తామనిం లక్ష్మణ్ నాయక్ తెలిపారు.

## ఆధ్యాత్మిక ప్రవచనాలతో సమాజాన్ని జాగృతం చేయాలి...

**డాక్టర్ మందా సురేఖ రెడ్డికి కళా రత్న అవార్డు**



**నాగర్ కర్నూల్ జులై 29( స్కై న్యూస్)** జిల్లా కేంద్రానికి చెందిన ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ మందా సురేఖ రెడ్డి కి "కళా రత్న" అవార్డుతో ఘనంగా సత్కరించారు. గురు పౌర్ణమి ని పురస్కరించుకొని హైదరాబాద్ లోని గ్లోబల్ ఫైన్ ఆర్ట్స్, యోగ ఎడ్యుకేషనల్ అకాడమీ తెలంగాణ భాషా సాంస్కృతిక, పర్యాటక శాఖ సౌజన్యంతో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆమెను సన్మానించి కళారత్న అవార్డుతో సత్కరించారు. మంద సురేఖ రెడ్డి మోటివేషనల్ స్పీచ్ లు, ఆధ్యాత్మిక ప్రవచనాలు వంటి వాటితో సమాజాన్ని జాగృతం చేస్తున్నందుకుగాను ఆమెకు ఈ గుర్తింపు లభించింది. గురు పౌర్ణమి సందర్భంగా గురువు విశిష్టత,జాతి నిర్మాణంలో గురువు పాత్ర చాలా గొప్పదని సనాతన భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు మూలం వేదాలు పురాణాలు ఇతిహాసాలు, ఉపనిషత్తులు వాఙ్మయ సంపద భారత జాతిని సత్యం ధర్మం అనే రెండు అంశాలపై నడిపిస్తుందని ఆమె విశ్లేషణాత్మకంగా అందించిన వ్యాసాలు ప్రసంగాలతో ఆమె ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. గురువుకు సమాజంలో ఉన్న స్థానాన్ని విశ్లేషణాత్మకంగా వివరించడంలో ఆమె చూపిన ప్రతిభ అందరిని ఆకట్టుకుంది. ప్రధాని మోడీ కలలు కన్నా విశ్వగురు స్థానాన్ని సాధించాలంటే గురువుల శిష్యుల శక్తి సామర్థ్యాలు దేశానికి అవసరమని శాస్త్ర సాంకేతిక విషయాలన్నీ వేదాలు ఉపనిషత్తులు భగవద్గీతలోనే ఉన్నాయని ఆమె వివరించారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు డాక్టర్ మల్లెపూల వెంకటరమణ ఫౌండర్, చైర్మన్, బిజెపి కల్చరల్ సెల్ కన్వీనర్ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ కల్చరల్ కోఆర్డినేటర్ దేవాజ్ఞ సరస్వతి శర్మ, కేవీఎల్ నరసింహారావు తేలు విజయ, ప్రేమలత క్షీరసాగర్ రామకృష్ణ తదితర చేతిలో మీదుగా కళారత్న అవార్డును అందించి గజమాలతో సత్కరించి మెమొంటోను అందించారు. మంద సురేఖ రెడ్డి నాగర్ కర్నూల్ జిల్లా ముష్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తనను ఈ అవార్డుకు ఎంపిక చేసిన సంస్థలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. తనకు కళారత్న అవార్డు అందడం ఎంతగానో ఆనందం కలిగించిందని మంద సురేఖ రెడ్డి అన్నారు.


## రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం



**భద్రాద్రి కొత్తగూడెం జూలై 29 ( స్కై న్యూస్):**తెలంగాణ రాష్ట్ర ఆథరైజ్డ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు, రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ఊకె శేఖర్ బుధవారం భద్రాచలం మండలంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. రేషన్ డీలర్ల సంక్షేమం, సంఘం బలోపేతమే లక్ష్యంగా ప్రతి రేషన్ డీలర్ సభ్యత్వం పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్, మండలాల ఆథరైజ్డ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు, రేషన్ డీలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు భూక్యా సందీప్‌తో పాటు భూక్యా లక్ష్మణ్, జీ. రమేష్, ఎస్. రాంబాబు, వి. వీరయ్య, భూక్యా సాయి కౌశిక్, కె. రమాదేవి, పి. సరోజిని తదితరులు పాల్గొన్నారు.

# ఉట్కూరులో శ్రీ దత్త లింగేశ్వర స్వామి దేవస్థానంలో ఘనంగా
# గురు పౌర్ణమి వేడుకలు..

ఉట్కూర్ జూలై 29 ( స్పై న్యూస్ ) నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల కేంద్రంలోని శ్రీ దత్తాత్రే లింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం గురు పౌర్ణమి సందర్భముగా గురుపూజ మహోత్సవాలను వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో జరిపారు . ఈ సందర్భంగా గురుపూజ. భజనలు. తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువులకు భక్తులు పాదసేవలు చేశారు. గురువులు విజయరాజు మాట్లాడుతూ గురువు చూపే మార్గమే మనిషిని అజ్ఞానందకారం నుంచి జ్ఞాన వెలుగులోకి నడిపిస్తుందని అన్నారు. గురువు బోధనలను ఆచరణలో పెట్టిన వారే నిజమైన భక్తి మార్గంలో ఉంటారని పేర్కొన్నారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన నిర్వాహకులు కోటకొండ ఎద్ల పద్మావతి. దేవలయ కమిటీ మెంబర్స్. భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







# గురువుల ఆశీస్సులతో సన్మార్గంలో పయనించాలి....

**బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్.**

నాగర్ కర్నూల్ జూలై 29 (స్పై న్యూస్) ప్రతి ఒక్కరూ గురువుల ఆశీస్సులతో జ్ఞానం ధర్మం కోసం పనిచేస్తూ సన్మార్గంలో పయనించినప్పుడే సమాజం సుఖశాంతులతో విరజిల్లుతుందని బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ అన్నారు బుధవారం గురు పౌర్ణమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ అధ్యక్షులు మునిసిపల్ చైర్మన్ తీగల సునీంద్ర కుమార్ తోపాటు కమిటీ సభ్యులు స్వాగతం పలికారు శాలువాతో సన్మానించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించేలా ఆ వెంకటేశ్వర స్వామి కరుణాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరారు కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు శివ ప్రమోద్ కుమార్ ఆలయ కమిటీ సభ్యులు దశరథం ప్రశాంత్ రెడ్డి సురేష్ అయ్యగారు సురేష్ ప్రసాద్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు



# పీవీకే-5 ఇంక్లైన్‌లో జీఎం ఎం. షాలెమ్ రాజు కి వీడ్కోలు సన్మానం

సింగరేణి జూలై 29( స్పై న్యూస్): జూలై 31న పదవీ విరమణ పొందనున్న కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలెమ్ రాజు కి బుధవారం పీవీకే-5 ఇంక్లైన్‌లో ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు జీఎం షాలెమ్ రాజు ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.వక్తలు మాట్లాడుతూ షాలెమ్ రాజు తన 37 సంవత్సరాల సుదీర్ఘ సేవాకాలంలో బొగ్గు ఉత్పత్తి, భద్రత, క్రమశిక్షణ, ఉద్యోగుల సంక్షేమానికి విశేష ప్రాధాన్యత ఇచ్చి సంస్థ అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు. యాజమాన్యం--కార్మికుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పుతూ, సమస్యల పరిష్కారంలో సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించారని పేర్కొన్నారు.అనంతరం పలువురు ఆయన సేవలను స్మరించుకొని, పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలు, ఆనందం, సుఖసంతోషాలతో కూడిన జీవితం గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పీవీకే నెం.5 ఇంక్లైన్ ఏజెంట్ శ్రీ రామ్ భరోస్ మెహతో మేనేజర్ పి.రవికిరణ్ ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్ , ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు , గ్రూప్ ఇంజనీర్ గోదావరి శ్రీనివాసరావు, సేఫ్టీ ఆఫీసర్ అనిల్ సాగర్, వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్, ఐఎన్టియుసి పిట్ సెక్రటరీ చిలక రాజయ్య , ఏఐటియుసి పిట్ సెక్రటరీ భూక్యా రమేశ్ , పిట్ ఇంజనీర్ శ్రీనివాస్ ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వైద్య శిబిరంలో 78 మందికి కంటి పరీక్షలు

**35 మందికి కంటి ఆపరేషన్లు**

నాగర్ కర్నూల్ జూలై 29( స్పై న్యూస్):జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా బుధవారం నాడు జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనం102 గది లో నిర్వహించిన కంటి చికిత్స శిబిరంను ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్.భరత్ కుమార్ రెడ్డి ప్రారంభించారు.ఈ శిబిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 78 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా,అందులో అర్హులైన క్యాటరాక్ట్ పొరగల 35మందిని గుర్తించి ప్రత్యేక అంబులెన్స్ లో లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి పంపినట్లు ఆయన తెలిపారు. రోగులకు శిబిరం లో ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు,మందులు అందజేశారు.ప్రతి ఒక్కరు జీవితకాలము కంటిచూపును కలిగి ఉండుటకు ప్రతి రోజు నిత్య భోజనంలో విటమిన్- ఏ తో కూడిన ఆహార పదార్థాలు క్యారెట్,ఆకుకూరలు,చేపలు అధిక మొత్తంలో భుజించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి కొత్త బాలాజీ, హెల్త్ ఎడ్యుకేటర్ ఒరుగంటి. శ్రీనివాస్ , మలిపెద్ది సురేష్,సాయి , రోగులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ శ్రీ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు చెక్కుల పంపిణీ

**ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరో మైలురాయి.**

మక్తల్ జూలై 29 ( స్పై న్యూస్) నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం: నర్వ మండల కేంద్రంలో కళ్యాణలక్ష్మి ఓ షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేసి, వారి కుటుంబాల ఆనందంలో కాంగ్రెస్ ప్రభుత్వం భాగస్వామిగా నిలిచింది.పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పిస్తూ...ప్రతి అర్హులైన కుటుంబానికి ప్రజా ప్రభుత్వ అండగా నిలుస్తూ...సంక్షేమ పాలనను చేతల్లో చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.ఈ కార్యక్రమంలో నర్వ మండల వీసా మల్లారెడ్డి గారు, మండల పీఎసీ శ్రీనివాస్ గారు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ గారు నర్వ గ్రామ సర్పంచ్ టి హనుమంత్ రెడ్డి గారు, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు జిల్లా జనరల్ సెక్రెటరీ నాగన్నగారి శ్రీనివాస్ రెడ్డి గారు, పోలీస్ జగన్ మోహన్ రెడ్డి గారు, మండల ఉపాధ్యక్షులు శరణప్ప గారు, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బద్దిపల్లి రాజారెడ్డి గారు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు్రా అశోక్ గౌడ్ గారు, నర్వ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్దల ఆంజనేయ రెడ్డి గారు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.



# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**వైద్యాధికారుల జూమ్ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఓ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్**

కొత్తగూడెం జూలై 29( స్పై న్యూస్): జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రుల పర్యవేక్షణపై జిల్లా వైద్య ఓ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ వైద్యాధికారులతో జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు ఏరియా ఆసుపత్రులు టీచింగ్ ఆసుపత్రులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులు , వైద్య కళాశాలలు, ప్రైవేట్ హాస్పిటళ్లు ప్రైవేట్ క్లినిక్‌లు తప్పనిసరిగా మూడు అంశాలను అమలు చేయాలని సూచించారు.ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రిలో కుక్క కాటు మందులు అందుబాటులో ఉంచాలి.ప్రతి ఆసుపత్రిలో కుక్క కాటు కేసుల పర్యవేక్షణ కోసం ఒక నోడల్ అధికారిని నియమించాలి.ఈ వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా నోటీసు బోర్డుపై ప్రదర్శించాలి.అదేవిధంగా, వైద్యాధికారులు తమ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లను రెండు వారాలకి ఒకసారి తప్పనిసరిగా తనిఖీ చేసి విద్యార్థులకు వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేయాలని, హాస్టల్ సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. హాస్టల్లో వంట చేసే వారికి తప్పనిసరిగా జుట్టు చేతి గోర్లు కత్తిరించుకోవాలని తెలియజేశారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి జ్వరం, విరేచనాలు, వాంతులు, దగ్గు, జలుబు తదితర లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి వెంటనే సంబంధిత వైద్యాధికారికి సమాచారం అందించాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి చికిత్స అందించాలని సూచించారు.ప్రతి మంగళవారం, శుక్రవారం యాక్షన్ ప్లాన్ ప్రకారం నిర్వహించే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి వారాంత నివేదికలను సూపర్వైజర్లు, వైద్యాధికారులకు సమర్పించాలని తెలిపారు. ఆ నివేదికల ఆధారంగా వ్యాధుల అధికంగా నమోదవుతున్న గ్రామాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రోగ్రాం అధికారులు తమ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, ఎన్సీడీ స్క్రీనింగ్, క్షయదానం, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ఆరోగ్య మహిళ, సికిల్ సెల్ స్క్రీనింగ్, టీబీ అనుమానితుల గుర్తింపు, రోగులకు మందుల పంపిణీ, వైద్య శిబిరాల నిర్వహణ తదితర కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రతి ఆరోగ్య కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు, సూచనలు అందిస్తూ నిరంతర సమీక్షలు నిర్వహించాలని తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని డాక్టర్ తుకారం రాథోడ్ సూచించారు.విధుల పట్ల నిర్లక్ష్యం లేదా అలసత్వం ప్రదర్శించిన సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



# ఎస్ ఐ ఆర్ ను సమర్థవంతంగా పూర్తి చేయాలి

**క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయాలి.**

**బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్.**

నాగర్ కర్నూల్ జూలై 29 (స్పై న్యూస్) బోగస్ ఓట్లను నివారించి పారదర్శకంగా ఎన్నికలను జరిపేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎన్నో పథకాలను సంస్కరణలను అమలు చేయడం జరిగిందని వాటిలో భాగంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయి నుండి నాయకులు కార్యకర్తలు ప్రత్యేక దృష్టితో పనిచేయాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి పార్లమెంటు అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ సూచించారు మునిసిపాలిటీ పరిధిలోని పలు బూత్ లలో మరియు నాగనూల్ దేశి ఇటిక్యాల వార్డులలో పర్యటించి కార్యకర్తలతో బిఎల్ఏ లతో కార్యక్రమ నమోదు తెలుసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించారు సందర్భంగా కార్యకర్తల ఇంటిలో బస చేసి కార్యకర్తలను మమేకం చేశారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించే విధంగా ఎస్ఐఆర్ ను విజయవంతం చేయాలని కోరారు కార్యకర్తలు చిన్న చిన్న విభేదాలను దృష్టిలో ఉంచుకొని నిర్లక్ష్యం చేయకుండా కలిసికట్టుగా ప్రతి ఓటును నమోదు చేస్తేనే రాబోయే రోజులలో బిజెపి అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. అనంతరం నాగనూల్ గ్రామంలో పార్టీ బూత్ అధ్యక్షులు జాజాల కృష్ణ అనారోగ్యానికి గురై ఆపరేషన్ అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించి పరిస్థితి తెలుసుకున్నారు అనంతరం పట్టణంలో ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ పరిషత్ తోపాటు పలువురు ప్రముఖులను కలిసి కార్యక్రమ వివరాలను వివరించారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చెన్న ప్రమోద్ కుమార్ నాయకులు గణేష్ కళ్యాణ్ రామ్ చంద్ర రెడ్డి పుల్లారెడ్డి లక్ష్మయ్య సూర్యనారాయణ శివ పరిషరాములు రమేష్ వెంకటయ్య రాము తదితరులు పాల్గొన్నారు





# శ్రీ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వనమా రాఘవ దంపతులు

పాల్వంచ జూలై 29 (స్పై న్యూస్ ):గురు బ్రహ్మ గురు విష్ణుః గురు దేవో మహేశ్వరః గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః.అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అనే భారతీయ సనాతన సంప్రదాయాన్ని చాటుతూ గురు పౌర్ణమి సందర్భంగా పాత పాల్వంచ శ్రీ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రరావు వనమా జేబీ సరోజినీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినారు. 46వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల ప్రవీణ్ కుమార్ శ్రీలత పాల్గొని పాత పాల్వంచ లో వెలిసిన ఉన్న శ్రీ సాయిబాబా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,అన్ని దానాల కంటే అన్నదానం మిన్న. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం మహా పుణ్యకార్యం. గురువుల ఆశీస్సులు ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నాం" అని అన్నారు.అనంతరం పాత పాల్వంచ ప్రజలందరికీ, ముఖ్యంగా ప్రజలకు గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.ఆలయ కమిటీ ముత్యాల కోటేశ్వరరావు ,వారి బృందం వారికి శు భాకాంక్షలు తెలియజేసారు ఈ కార్యక్రమంలో ముత్యాల వీరభద్రం ,ముత్యాల రమణ మూర్తి , గంధం రాజయ్య ,47వ డివిజన్ పార్టీ ఇంచార్జ్ మిరియాల అలివేలు, బట్టు మంజుల ,ఏనుగుల శ్రీను ,కిలారి సుజాత ,యాదయ్య , ఆర్ఎంపీ శ్రీను , సిద్ధు, ముదిగొండ శ్రీను, పిల్లల గంగాధర్ ,రాము,శివరాత్రి వినయ్ ,తదితరులు పాల్గొన్నారు



వార్తాతరంగాలు
గురువారం 30 జూలై 2026

## బిజినెస్

### అధిక కెఫీన్ కలిగిన ఆ పానీయాలకు ఎనర్జీ డ్రింక్ అనే పదం వాడొద్దు : ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆదేశం

అధిక కెఫిన్ కలిగిన పానీయాలను ఎనర్జీ డ్రింక్స్ (జుఅవతీస్త్రం ఐతీఅఅని) గా ప్రచారం చేయవద్దని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఖీూూూ×) కీలక ఆదేశాలు జారీచేసింది. పెప్సీ (ూవజూంఱ), రెడ్ బుల్ (=వంఎబశ్రీశ్రీ), మాన్‌స్టర్ బెవరేజ్, రిలయన్స్, హెల్ ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల లేబుళ్ల నుంచి 'ఎనర్జీ డ్రింక్' అనే పదాన్ని, దానికి సంబంధించిన వర్ణనలను 90 రోజుల్లోగా తొలగించాలని తన ఆదేశాల్లో పేర్కొన్నది. భారత్‌లో 'ఎనర్జీ డ్రింక్స్' పేరిట విక్రయిస్తున్న ఉత్పత్తులకు సంబంధించి ఎటువంటి అధికారిక ప్రమాణాలు లేవని ఖీూూూ× పేర్కొన్నది. 'శరీరానికి, మనసుకు ఉత్తేజాన్ని ఇస్తుంది' లేదా 'శారీరక బలహీనతను తగ్గిస్తుంది' వంటి ప్రకటనలు వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడింది. బ్రాండింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలతో గతంలోనే రెడ్ బుల్, పెప్సీకోకు చెందిన స్టింగ్, రిలయన్స్ క్యాంపా ఎనర్జీ వంటి బ్రాండ్‌లకు సంస్థ నోటీసులు జారీచేసింది.

ఇటీవల పరిశ్రమ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో రజిత్ పున్హానీ ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. ఈ క్రమంలో నిబంధనలకు కట్టుబడి ఉంటామని కంపెనీలు అంగీకరించడంతో, లేబుళ్ల మార్పునకు సంబంధించి ప్రభుత్వం 90 రోజుల గడువు ఇచ్చింది. దేశీయంగా ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా 2017లో పెప్సీ కంపెనీ తక్కువ ధరకే 'స్టింగ్' బ్రాండ్‌ను పరిచయం చేయడంతో యువతలోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటికి ఆదరణ గణనీయంగా పెరిగింది. యూరోమానిటర్ అంచనాల ప్రకారం.. 2028 నాటికి భారత ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ విలువ 1.6 బిలియన్ డాలర్లకు చేరుకోనుంది.

### దేశంలో త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ.. ట్రయల్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్




దేశంలో త్వరలో ప్లాస్టిక్ లేదా పాలిమర్ కరెన్సీ నోట్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రూ.10, రూ.20 విలువ కలిగిన ప్లాస్టిక్ లేదా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రయోగాత్మకంగా పరీక్షిద్దామని భారత రిజర్వ్ బ్యాంక్ చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభ (ూశీని ఝఎష్టు) లో ఒక లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. ఈ ప్రయోగాల్లో భాగంగా రూ.10, రూ.20 డినామినేషన్లలో వంద కోట్ల చొప్పున పాలిమర్ నోట్లను ఆర్బీఐ జారీ చేయనుంది. భారతీయ వాతావరణ పరిస్థితుల్లో ఈ నోట్ల మన్నిక, పనితీరును పరిశీలించడమే ఈ క్షేత్రస్థాయి పరీక్షల ప్రధాన ఉద్దేశం. ఈ ప్రయోగాలు విజయవంతమైతేనే వీటిని దేశవ్యాప్తంగా విస్తృతస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంపై తుది నిర్ణయం తీసుకుంటారు. అయితే, ప్లాస్టిక్ పాలిమర్ నోట్లను ప్రవేశపెడుతున్నంత మాత్రాన ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దుచేసే ప్రతిపాదన ఏదీ లేదని ప్రభుత్వం స్పష్టంచేసింది. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నిక కలిగి ఉంటాయని, ఇవి సులభంగా పాడవవని ఆర్బీఐ పేర్కొన్నది. ముఖ్యంగా తక్కువ విలువ కలిగిన నోట్లు త్వరగా చిరిగిపోతుండటంతో వాటిని తరచూ మార్చాల్సి వస్తోంది. పాలిమర్ నోట్ల వినియోగంవల్ల ముద్రణ, నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# గుడ్ న్యూస్ చెప్పిన ఇండియన్ ఆయిల్.. బుక్ చేసిన నాలుగు గంటల్లోనే సిలిండర్ డెలివరీ



ఎల్పీజీ వినియోగదారులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కొత్త సేవను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నౌ' పేరుతో తేలికైన 10 కిలోల కాంపోజిట్ గ్యాస్ సిలిండర్‌ను ప్రవేశపెట్టడంతోపాటు బుక్ చేసిన నాలుగు గంటల్లోనే ఇంటికే డెలివరీ చేసే సేవను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ సేవను ఎంపిక చేసిన నాలుగు నగరాల్లో ప్రారంభించినట్లు సంస్థ ప్రకటించింది. సంప్రదాయ ఉక్కు సిలిండర్లతో పోలిస్తే కొత్త 10 కిలోల కాంపోజిట్ సిలిండర్ బరువు తక్కువగా ఉంటుంది. దాంతో దాన్ని మోయడం, తరలించడం, వినియోగించడం మరింత సులభమవుతుందని ఇండియన్ ఆయిల్ తెలిపింది. గృహ వినియోగంతోపాటు చిన్న వ్యాపార అవసరాలకు కూడా ఇది అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నది. బుక్ చేసిన నాలుగు గంటల్లోనే సిలిండర్‌ను ఇంటికే అందించేలా కొత్త సేవను రూపొందించింది. ఈ సేవలో వినియోగదారులకు మరికొన్ని సౌకర్యాలు కూడా కల్పించారు. తమకు అనుకూలమైన డెలివరీ సమయాన్ని ఎంచుకునే అవకాశం కల్పించారు. డిజిటల్ విధానంలో సులభంగా బుక్ చేసుకునే సదుపాయం కూడా అందుబాటులో ఉంటుంది. దాంతో గ్యాస్ బుకింగ్ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా మారుతుందని సంస్థ తెలిపింది. ప్రస్తుతం పుణే, గురుగ్రామ్, ఇండోర్, కోయంబత్తూరు నగరాల్లో ఈ కొత్త సేవ అందుబాటులో ఉంది. వినియోగదారుల స్పందనను బట్టి త్వరలో మరిన్ని నగరాలకు విస్తరించనున్నట్లు ఇండియన్ ఆయిల్ వెల్లడించింది. అలాగే 5 కిలోల ఇండేన్ చోటూ సిలిండర్‌కు కూడా నాలుగు గంటల్లో డెలివరీ సేవను విస్తరించింది. చిన్న కుటుంబాలు, విద్యార్థులు, చిరు వ్యాపారులు ఎక్కువగా వినియోగించే ఈ సిలిండర్‌ను కూడా త్వరగా అందించేలా చర్యలు తీసుకుంది.

# ఐదు రోజుల నష్టాలకు బ్రేక్.. భారీ లాభాలతో ముగిసిన దేశీయ మార్కెట్లు


**776 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్**

**24 వేల మార్కుకు చేరువైన నిఫ్టీ**

**ముడిచమురు ధరల తగ్గుదలతో ఊపు**

**ఐటీ, మీడియా, రియాల్టీ షేర్ల జోరు**

**రూపాయి బలపడటంతో మెరుగైన సెంటిమెంట్**



వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్ల పాటు నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీగా పుంజుకున్నాయి. ముడిచమురు ధరలు తగ్గడం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు సద్దుమణగడంతో ఇన్వెస్టర్లలో కొనుగోళ్ల ఉత్సాహం పెరిగింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ రెండు శాతానికి పైగా లాభపడ్డాయి. నిఫ్టీ మళ్లీ 24 వేల మార్కుకు చేరువైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 776.29 పాయింట్లు ఎగిసి 76,835.78 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 229.40 పాయింట్లు పెరిగి 23,995.95 వద్ద స్థిరపడింది. అమెరికా, ఇరాన్ మధ్య సైనిక చర్యలు తాత్కాలికంగా నిలిచిపోవడంతో ముడిచమురు ధరలు తగ్గాయి. దీంతో దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు ఉపశమనం లభిస్తుందనే అంచనాలు మార్కెట్లకు ఊతమిచ్చాయి. నిఫ్టీ షేర్లలో ఎటర్నల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్ అత్యధిక లాభాలు నమోదు చేశాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మెరుగ్గా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.11 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.31 శాతం పెరిగాయి. ఐటీ, మీడియా, రియాల్టీ రంగాల షేర్లు కొనుగోళ్లతో కళకళలాడాయి. రియాల్టీ, ఫార్మా, మెటల్ సూచీలు కూడా మూడు రోజుల నష్టాల నుంచి బయటకొచ్చాయి. మరోవైపు ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ మాత్రం ఇతర రంగాలతో పోలిస్తే బలహీనంగా కనిపించింది. ముడిచమురు ధరలు తగ్గడం, రూపాయి బలపడటం, ఐటీ షేర్లలో కొనుగోళ్లు, కంపెనీల మెరుగైన త్రైమాసిక ఫలితాలు మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయని విశ్లేషకులు పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడుల ప్రవాహం మెరుగుపడటం కూడా దేశీయ మార్కెట్ల సెంటిమెంట్‌ను బలోపేతం చేసిందని అభిప్రాయపడ్డారు.

# అదరగొడుతున్న యువ బాక్సర్లు.. క్వార్టర్ ఫైనల్లో అంకుశ్, సచిన్!




కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లు చెలరేగుతున్నారు. సూపర్ పంచ్‌లతో ప్రత్యర్థులను ఓడిస్తున్న అంకుశ్(ూఅఎబంష్ట్ర), సచిన్ సివాచ్(ఝఎష్ట్రఱఅ ూఱఝఎష్ట్ర)లు పతక వేటలో దూసుకెళ్తున్నారు. పురుషుల 80 కిలోల విభాగంలో అంకుశ్ క్వార్టర్ ఫైనల్ చేరగా.. 60 కిలోల ఇంగ్లండ్ బాక్సర్‌ను చిత్తు చేసిన సచిన్ సైతం క్వార్టర్స్ బెర్తు సాధించాడు. దాంతో, వీరిద్దరూ మరో బౌట్ గెలిచారంటే కనీసం కాంస్యం సొంతమవుతుంది.అయితే.. వీరు మాత్రం పసిడి పతకమే తమ లక్ష్యమంటున్నారు. గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లు అద్భుతంగా రాణిస్తున్నారు. 60 కిలోల విభాగంలో సచిన్ సివాచ్, 80 కిలోల విభాగంలో అంకుశ్‌లు క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టారు. సోమవారం జరిగిన 16వ రౌండ్ ఇంగ్లండ్ బాక్సర్ విలియం హెవిట్‌ను సచిన్ చిత్తు చేశాడు. ప్రత్యర్థిపై పంచ్‌లతో విరుచుకుపడిన సచిన్ స్వర్ణం గెలవడమే తన లక్ష్యం అంటున్నాడు. 'కోచ్ మాటలు విన్న తర్వాత నేను పుంజుకున్నాను. నా లక్ష్యం పతకం గెలవడమే. అది కూడా గోల్డ్ మెడల్. టోర్నీ ఆరంభం నుంచి నేను పసిడి కోసమే పోరాడుతున్నా. తొలి రెండు మ్యాచ్‌లు కష్టంగా గట్టెక్కాను. తదుపరి బౌట్‌లకు నేను పక్కాగా సిద్ధమవుతా' అని సచిన్ మీడియాతో వెల్లడించాడు.

**ఏకపక్ష పోరులో**

మరో పదహారో రౌండ్ మ్యాచ్‌లో హర్యానాకు చెందిన అంకుశ్ ధాటికి జలాన్ జాన్(అంటిగ్వా) చేతులెత్తేశాడు. 80 కిలోల విభాగంలో పోటీపడిన అంకుశ్ ఆరంభం నుంచి జలాన్‌పై పంచ్‌ల వర్షం కురిపించాడు. దాంతో, భారత బాక్సర్ 5-0తో గెలుపొందాడు. ఏకపక్ష పోరులో సూపర్ విక్టరీ కొట్టిన ఈ పొడగరి బాక్సర్ అలవోకగా క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. సెమీస్ చేరితో చాలు అంకుశ్ దేశానికి కనీసం కాంస్యం అందించే అవకాశముంది.

### పట్టువదలని జ్ఞానేశ్వరి.. వెయిట్‌లిఫ్టింగ్‌లో రజతంతో మురిసిందిలా..!




కామన్వెల్త్ క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టర్ వెయిట్‌లిఫ్టర్లు పతకాల పంట పండిస్తున్నారు. ఇప్పటికే మీరాబాయి చాను, రిషికాంత సింగ్, రాజా ముత్తుపాండీలు మెడల్స్ సాధించగా.. జ్ఞానేశ్వరీ యాదవ్ దేశానికి వెండి పతకం అందించింది. 53 కిలోల విభాగంలో జ్ఞానేశ్వరి ఈ మెడల్ సాధించింది. సోమవారం హోరాహోరీగా జరిగిన ఫైనల్లో నైజీరియా లిఫ్టర్‌కు దాదాపు సరిసమానంగా బరువులెత్తిన ఆమె రెండో స్థానంతో సరిపెట్టుకుంది. గ్లాస్గోలో భారత వెయిట్‌లిఫ్టర్లు అద్భుత ప్రదర్శనతో పతకాలు కొల్లగొడుతున్నారు. ఇప్పటికే ఈ విభాగంలో మూడు మెడల్స్ రాగా.. సోమవారం జ్ఞానేశ్వరీ యాదవ్ వెండి వెలుగులు విరజిమ్మింది. 53 కిలోల కేటగిరీలో పోటీపడిన తను.. తొలి ప్రయత్నంలో జ్ఞానేశ్వరి యాదవ్ 82 కిలోలు ఎత్తింది. మూడో ప్రయత్నంలో 85, మూడోసారి 88 కిలోలతో రికార్డు నెలకొల్పింది. అయితే.. కాసేపటికే నైజీరియా లిఫ్టర్ ఒనొమె ఒమొలోలా దిదిహ్ ఏకంగా 90 కిలోలు ఎత్తి ఆధిక్యంలో నిలిచింది. స్నాచ్ విభాగంలో రెండో స్థానంలో నిలిచిన భారత లిఫ్టర్.. పసిడికి గట్టిపోటీనిచ్చింది. అనంతరం కీలకమైన జెర్క్ అండ్ స్నాచ్ విభాగంలో ఆమె 103 కిలోలు లిఫ్ట్ చేసింది. ప్రత్యర్థి ఒనొమె కూడా 105 కిలోలు ఎత్తడంతో పోటీ రసవత్తరంగా మారింది. ఇక రెండోసారి జ్ఞానేశ్వరి 107 కిలోలు ఎత్తింది. చివరి అటెంప్ట్‌లో ఇద్దరూ 111 కిలోలతో అందర్నీ ఆశ్చర్యపరిచారు. మొత్తంగా 199 కిలోల బరువులుఎత్తిన జ్ఞానేశ్వరి రెండో స్థానంలో నిలిచి రజతంతో యావత్ దేశం గర్వపడేలా చేసింది.

## స్పోర్ట్స్

### జింబాబ్వే పర్యటనలో కోచ్‌గా లక్ష్మణ్ హిట్.. గంభీర్‌పై వేటు తప్పదా..!





ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్ అనంతరం భారత జట్టు గాడీలో పడేనా? అనే ప్రశ్నలకు జింబాబ్వే పర్యటనతో జవాబు దొరికింది. వరసగా రెండు సిరీస్‌లో కోల్పోయిన బాధను దిగమింగుతూ శ్రేయాస్ అయ్యర్ సేన.. ఆఫ్రికా జట్టును క్లీన్‌స్వీప్ చేసింది. వారం క్రితం చేజారిన నంబర్ 1 ర్యాంకును కైవసం చేసుకుంది టీమిండియా. అలాఅనీ ఈ క్రెడిట్ అంతా హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌ది కాదు. అప్పుడప్పుడు టీ20 జట్టుకు కోచ్‌గా వ్యవహరించే వీవీఎస్ లక్ష్మణ్ హయాంలో అయ్యర్ సేన సిరీస్‌ను 3-0తో గెలిచింది. దాంతో.. ఈ ఫార్మాట్‌లో లక్ష్మణ్‌ను కోచ్‌గా కొనసాగిస్తారా? అనే చర్చ మొదలైంది.

టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో భారత జట్టుకు వైట్‌వాష్ అవమానం ఎదురైంది. హెడ్‌కోచ్ గౌతం గంభీర్ మార్గనిర్దేశం చేసినా కుర్రాళ్లతో నిండిన జట్టు పరిస్థితులను అర్థం చేసుకోలేక.. నిలకడను ప్రదర్శించలేక సిరీస్‌లు కోల్పోయింది. ఫలితంగా.. గౌతీని టీ20 కోచ్‌గా తప్పించాలని, మళ్లీ సూర్యకుమార్ యాదవ్‌కే పగ్గాలు అప్పగించాలని డిమాండ్లు వచ్చాయి. అయితే.. వారంలోనే పరిస్థితి మారిపోయింది. వరసగా రెండు సిరీస్‌లు, నంబర్ 1 ర్యాంక్ కోల్పోయిన టీమిండియా మూడు మ్యాచుల సిరీస్‌లో 3-0తో జింబాబ్వేను చిత్తు చేసింది. కెప్టెన్ అయ్యరే అయినప్పటికీ కోచ్ మాత్రం వీవీఎస్ లక్ష్మణ్. మూడో టీ20లో జింబాబ్వేపై 35 పరుగుల విజయం అనంతరం కెప్టెన్ అయ్యర్ డ్రెస్సింగ్ రూమ్‌లో లక్ష్మణ్‌పై ప్రశంసలు కురిపించాడు. 'మేము ఏ పొరపాట్లు చేయలేదు. క్యాచ్‌లు వదలేయడం చాలా వరకూ తగ్గింది. సిరీస్ క్లీన్‌స్వీప్ చేయడంలో సహాయక సిబ్బందితో కలిపి జట్టులోని ప్రతిఒక్కరూ ఎంతో కృషి చేశారు. మమ్మల్ని ఎంతగానో ప్రేరేపించినందుకు, మాలో స్ఫూర్తి నింపినందుకు లక్ష్మణ్ సర్‌కు ధన్యవాదాలు. మైదానంలో దిగిన ప్రతిసారి వంద శాతం పోరాడాలని మీరు చెప్పారు. అందుకు మీకు కృతజ్ఞతలు' అని అయ్యర్ పేర్కొన్నాడు. భారత టీ20 కోచ్‌గా లక్ష్మణ్ విజయవంతమవుతున్నాడు. ఇదివరకు శ్రీలంక పర్యటనలోనూ లక్ష్మణ్ జట్టును విజేతగా నిలిపాడు. దాంతో.. అతడికే టీ20 కోచింగ్ బాధ్యతలు ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అంతేకాదు 2027 వన్డే ప్రపంచకప్‌తో హెడ్‌కోచ్‌గా గంభీర్ కాంట్రాక్ట్ ముగియనుంది. దాంతో.. తదుపరి టీమిండియా కోచ్‌గా లక్ష్మణ్‌ను నియమించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే.. ఈ మాజీ సొగసరి ఆటగాడు మాత్రం అందుకు సిద్ధంగా లేనని చెబుతున్నాడు. గౌతం గంభీర్, సీనియర్ కోచింగ్ సిబ్బంది అందుబాటులో లేనప్పుడు నేను కోచ్‌గా ఉంటానంతే అని లక్ష్మణ్ వెల్లడించాడు.



# నాకు ఎవరేం పని చేసినా నచ్చదంటున్న వెంకీ



టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.

## పొలిమేర 3 లో యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా..

### మైండ్ బ్లోయింగ్ అప్‌డేట్‌తో పెరిగిన అంచనాలు!




టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'పొలిమేర' ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'పొలిమేర 3' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అర్జున్ ఎంట్రీతో 'పొలిమేర 3' కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు కూడా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన 'మా ఊరి పొలిమేర' ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. 'పొలిమేర 2' విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. మిస్టరీ, హారర్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది.ఇప్పుడు మూడో భాగం గత రెండు చిత్రాల కంటే మరింత భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' చిత్రంతో అర్జున్ సర్జా మరోసారి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మార్షల్ ఆర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో మంచి విజయాన్ని అందుకుంది. యాక్షన్ సన్నివేశాల్లో అర్జున్ చూపించిన ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను మెప్పించాయి.ఇలాంటి సమయంలో ఆయన 'పొలిమేర 3'లో భాగం కావడం సినిమాకు మరింత బలం చేకూర్చే అంశంగా భావిస్తున్నారు.

## 'మహేంద్రగిరి వారాహి' రిలీజ్ డేట్ ఫిక్స్..

### ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా పవన్ కళ్యాణ్..!




సుమంత్ హీరోగా, దర్శకుడు సంతోష్ జాగర్లపూడి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక సోషియో ఫాంటసీ చిత్రం 'మహేంద్రగిరి వారాహి' విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే కాన్సెప్ట్ పోస్టర్లు, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సెప్టెంబర్ 11న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ మాట్లాడుతూ, ఈ సినిమా కోసం దాదాపు రెండున్నరేళ్ల పాటు కృషి చేసినట్లు తెలిపారు. మధ్యలో కొన్ని కారణాల వల్ల ప్రాజెక్ట్ ఆలస్యమైనప్పటికీ, చివరకు అనుకున్న స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని చెప్పారు. కథలో ఎన్నో ఊహించని ట్విస్టులు ఉంటాయని, దర్శకుడు సంతోష్ జాగర్లపూడి ప్రేక్షకులకు పూర్తిగా కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందించారని అన్నారు. ఈ సినిమాలో కీలక పాత్ర కోసం నటి ఐశ్వర్యా రాజేశ్‌ను సంప్రదించగా, కథ నచ్చి వెంటనే అంగీకరించారని సుమంత్ వెల్లడించారు. అయితే ఆమె వారాహి అమ్మవారి పాత్రలో కనిపిస్తారా? లేక మరో ప్రత్యేకమైన పాత్రలో ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తారా? అనే విషయాన్ని మాత్రం ఇప్పుడే చెప్పలేమని తెలిపారు. ఆ సర్‌ప్రైజ్‌ను ప్రేక్షకులు థియేటర్లలోనే ఆస్వాదించాలని కోరారు. సినిమా బడ్జెట్ గురించి మాట్లాడుతూ, మొదట రూ.10 కోట్లలో సినిమా పూర్తి చేయాలని భావించామని, కానీ కథకు తగ్గట్టుగా విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో ఖర్చు గణనీయంగా పెరిగిందన్నారు. ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ వర్క్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, ప్రేక్షకులకు గూస్‌బంప్స్ వచ్చేలా విజువల్స్ రూపొందించామని వెల్లడించారు. దర్శకుడు సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ, ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయనను సంప్రదించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అధికారికంగా ఖరారైన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. చిత్రంలో ఓ ప్రముఖ స్టార్ హీరో దాదాపు 20 నిమిషాల పాటు ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారని నిర్మాత మధు వెల్లడించారు. అయితే ఆ స్టార్ హీరో ఎవరు అనే విషయాన్ని మాత్రం గోప్యంగా ఉంచడంతో సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి.

## రిషబ్ శెట్టి 'ఛత్రపతి శివాజీ మహారాజ్'లో భూమి పెడ్నేకర్.. యోధురాలి పాత్రలో బాలీవుడ్ బ్యూటీ!



పాన్ ఇండియా స్టార్ రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న ప్రతిష్టాత్మక చారిత్రక చిత్రం ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్ పై మరో ఆసక్తికరమైన అప్డేట్ బయటకు వచ్చింది. భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, మహా వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితకథ ఆధారంగా ఈ భారీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా హీరోయిన్ ఎంపికకు సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది.ఈ సినిమాలో బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ కీలక పాత్రలో నటించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఆమె చరిత్రలో తన ధైర్యసాహసాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన బేలవాడి మల్లమ్మ పాత్రను పోషించనుంది. శౌర్యం, త్యాగం, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఈ పాత్ర సినిమాలో అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుందని సమాచారం. భూమి పెడ్నేకర్ ఇప్పటివరకు ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు తొలిసారి ఇలాంటి చారిత్రక యోధురాలి పాత్రలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. కాగా, 'కాంతార' సినిమాతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రిషబ్ శెట్టి, ఇప్పుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం ఆయన ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నట్లు సమాచారం. శివాజీ మహారాజ్ వ్యక్తిత్వం, యుద్ధ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలను తెరపై అత్యంత సహజంగా ఆవిష్కరించేందుకు మేకర్స్ భారీ స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు సందీప్ సింగ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. కథ, విజువల్ డిజైన్, యుద్ధ సన్నివేశాలు, సెట్ల రూపకల్పన వంటి అంశాలపై చిత్రబృందం చాలా కాలంగా కసరత్తు చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటులు అర్జున్ రాంపాల్, వివేక్ ఒబెరాయ్ కూడా కీలక పాత్రలు పోషించనున్నారు. వీరి పాత్రలకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం మేకర్స్ ఇంకా వెల్లడించలేదు. అయితే చారిత్రక నేపథ్యానికి తగ్గట్టుగా ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని తెలుస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి కథను ప్రముఖ రచయిత రిషి విర్మాని అందిస్తుండగా, సంగీత బాధ్యతలను జాతీయ అవార్డు గ్రహీత అమిత్ త్రివేది నిర్వహిస్తున్నారు. చారిత్రక చిత్రానికి తగ్గట్టుగా శక్తివంతమైన నేపథ్య సంగీతం, భావోద్వేగభరితమైన పాటలను రూపొందించనున్నట్లు సమాచారం. ఈ ఏడాది చివర్లో సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం 2028లో ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు హైడ్రామా



నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదంతో ప్రారంభమైన ఆందోళనలు, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీశాయి. అయితే మొదట ధర్మేంద్ర ప్రధాన్? రాజీనామాకు కంటే ముందు ఆయనను వేరే శాఖకు మార్చాలని ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రశ్నపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులతో జరిపిన తొలి చర్చల్లో కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్? శాఖను మాత్రమే మార్చే ప్రతిపాదనను చేసిందని సమాచారం. అయితే ఆ ప్రతిపాదనను సీజేపీ ప్రతినిధులు పూర్తిగా తిరస్కరించినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను బీజేపీ ఖండించింది. అవి పూర్తిగా నిరాధారమైనవని, కల్పితమైనవని పేర్కొంది.

ఈ అంశంపై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర స్పందించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమనే ఇదన్నారు. ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదని చెప్పారు. ఇవన్నీ నిరాధార కథనాలేనని కొట్టిపారేశారు. కేవలం సంచలనాల కోసం ఇలాంటి అసత్య వార్తలను వ్యాప్తి చేయవద్దని హితవు పలికారు.

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చింది. సీజేపీ ప్రతినిధులతో సమావేశమైన కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్? పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్?ను విద్యాశాఖ నుంచి మరో మంత్రిత్వ శాఖకు మార్చే అవకాశాన్ని ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థుల ఆందోళనలు తగ్గుతాయని కేంద్రం భావించినట్లు సమాచారం. అయితే ప్రభుత్వ ప్రతిపాదనను సీజేపీ ప్రతినిధులు తిరస్కరించినట్లు తెలుస్తోంది. విద్యాశాఖ నుంచి బదిలీ చేయడం సమస్యకు పరిష్కారం కాదని, మంత్రి పదవి నుంచి పూర్తిగా తప్పుకోవడమే ప్రజలకు సరైన సందేశమని వారు స్పష్టం చేసినట్లు సమాచారం. ధర్మేంద్ర ప్రధాన్ ప్రభుత్వంలో కొనసాగితే ఉద్యమ లక్ష్యం నెరవేరదని, అందువల్ల రాజీనామా ఒక్కటే తమ డిమాండ్ అని చర్చల సందర్భంగా వెల్లడించినట్లు తెలిసింది.

**ఉద్యమకారుల్లో వ్యతిరేకత వస్తుందనే ఆందోళన**

చర్చల సందర్భంగా మంత్రివర్గంలో ఎవరు కొనసాగాలి? ఎవరికీ ఏ శాఖ కేటాయించాలన్నది పూర్తిగా ప్రధానమంత్రి అధికార పరిధిలోని అంశమని కేంద్ర ప్రతినిధులు సీజేపీకి వివరించినట్లు సమాచారం. అయినప్పటికీ, ఉద్యమకారులు తమ డిమాండ్‌లో ఎలాంటి మార్పు చేయడానికి సిద్ధంగా లేరని తెలుస్తోంది. శాఖ మార్పు కంటే మంత్రి పదవి నుంచి తప్పుకోవడమే మేలని వారు స్పష్టం చేసినట్లు సమాచారం. సీజేపీ చర్చల బృందం ప్రభుత్వ ప్రతిపాదనను అంగీకరిస్తే ఉద్యమంలో పాల్గొంటున్న విద్యార్థులు, మద్దతుదారుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశముందని వారు భావించినట్లు సమాచారం. అందుకే ఎలాంటి రాజీకి వెళ్లకుండా రాజీనామా డిమాండ్‌పైనే నిలబడినట్లు తెలుస్తోంది. ఉద్యమ లక్ష్యం నుంచి వెనక్కి తగ్గినట్లు సంకేతాలు వెళ్లకూడదనే ఉద్దేశంతో తమ వైఖరిని మార్చలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**రాజీనామా తర్వాత ముగిసిన ఆందోళన**

మూడో విడత చర్చలకు కొన్ని గంటల ముందే ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం సీజేపీ తమ నిరసన కార్యక్రమాలను విరమిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో గత కొన్ని వారాలుగా కొనసాగిన ఆందోళనలకు తాత్కాలికంగా తెరపడింది. రాజీనామా అనంతరం కేంద్ర ప్రభుత్వం, సీజేపీ మధ్య ఉద్రిక్తతలు కూడా తగ్గుముఖం పట్టాయి.

**రాహుల్ గాంధీ కూడా అదే డిమాండ్**

ఈ వివాదం సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్? శాఖను మార్చే ప్రయత్నాలు కేంద్రం చేస్తోందని ప్రతిపక్షాలు కూడా విమర్శించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మార్పు సరిపోదని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలకు న్యాయం జరగాలంటే మంత్రి పదవి నుంచి పూర్తిగా తప్పుకోవాల్సిందేనని ఆయన పలుమార్లు పేర్కొన్నారు. కేవలం శాఖను మార్చడం ద్వారా సమస్య ముగిసిపోదని, బాధ్యతను నిర్ధారించే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలన్నింటితో కేంద్ర ప్రభుత్వం తొలుత శాఖ మార్పు ద్వారా వివాదాన్ని చల్లార్చే ప్రయత్నం చేసింది. కానీ సీజేపీ మాత్రం పట్టుబట్టడంతో రాజీనామా తప్పలేదు.

# పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికలు కపట నాటకం



పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీఓకే) జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇవి ప్రజాస్వామ్య ఎన్నికలు కావని, పాకిస్థాన్ తన అక్రమ ఆక్రమణల్ని ప్రపంచం నుంచి దాచిపెట్టేందుకు, దృష్టి మరల్చేందుకు ఆడుతున్న కపట నాటకమని భారత్ ఎండగట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూూ) అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతాలతో సహా జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు మొత్తం భూభాగం భారతదేశంలో అంతర్భాగమేనని మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్ వైఖరి ఎప్పటికీ మారలేదని, అదే తమ విధానం అని పేర్కొన్నారు. పీఓకేలో ప్రజాస్వామ్యం అమలవుతోందనే భావన కల్పించడానికి మాత్రమే ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారని అన్నారు. వాస్తవానికి ఆ ప్రాంతంలో పాకిస్థాన్ అక్రమ ఆక్రమణ కొనసాగుతోందని, అక్కడి ప్రజలపై తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ దారుణాల నుంచి ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నమే ఎన్నికల నిర్వహణ అని జైస్వాల్ విమర్శించారు.

'పాక్ ఆక్రమిత జమ్మూకశ్మీర్‌లో ఇటీవల పెద్ద ఎత్తున జరుగుతున్న నిరసనలు కూడా అక్కడి ప్రజల అసంతృప్తికి నిదర్శనం. పాకిస్థాన్ ఆర్థిక దోపిడీకి పాల్పడటం, ప్రజల ప్రాథమిక హక్కుల్ని కాలరాయడం, పరిపాలనా అణచివేత కారణంగానే ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. ఎన్నికల పేరుతో ఈ వాస్తవాల్ని ప్రపంచానికి కనిపించకుండా చేయాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది.'

**భారత నాగరిక వారసత్వంపై పాక్‌కు హక్కులేదు!**

ఈ సందర్భంగా మరోసారి సింధు జలాల ఒప్పందం అంశంపైనా స్పందించారు జైస్వాల్. ఉమ్మడి సింధు లోయ నాగరికత తమది కూడా అని కొందరు పాకిస్థాన్ నిపుణులు చేస్తున్న వ్యాఖ్యల్ని ఆయన ఖండించారు. దశాబ్దాలుగా సరిహద్దు బయట ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, హింసకు మద్దతు ఇస్తున్న దేశానికి భారత నాగరిక, సాంస్కృతిక వారసత్వంపై హక్కు లేదని స్పష్టం చేశారు. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తర్వాత భారత్, సింధు జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది.

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలకు మద్దతుగా పాకిస్థాన్ నుంచి సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలపైనా జైస్వాల్ స్పందించారు. పాకిస్థాన్ దశాబ్దాలుగా భారత్‌పై సరిహద్దు దాటి ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుందని, ఆ దేశం వాస్తం స్వరూపం భారత యువతకు బాగా తెలుసని అన్నారు. భారత యువతతో పాటు కొత్త తరం కూడా పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న సరిహద్దు ఉగ్రవాదానికి పూర్తిగా ముగింపు పలకాలని కోరుకుంటోందని ఆయన చెప్పారు. పాకిస్థాన్ ప్రజలు, అక్కడి నాయకత్వం కూడా ఈ విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిదని చురకలంటించారు.

**సార్క్ సహకారాన్ని అడ్డుకుంటుంది పాకిస్థానే!**

ఇదే సమయంలో దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ కార్యకలాపాలు నిలిచిపోవడానికి పాకిస్థానే ప్రధాన కారణమని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ప్రాంతీయ సహకారాన్ని భారత్ ఎప్పటి నుంచో సమర్థిస్తోందని, అయితే సార్క్ ముందుకు సాగకుండా అడ్డుకుంటున్న దేశం ఏదో దక్షిణాసియాలోని ప్రతి ఒక్కరికీ తెలుసని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఇటీవల సార్క్‌ను తిరిగి చురుగ్గా మార్చాలని, సభ్య దేశాల మధ్య విభేదాల్ని చర్చల ద్వారా పరిష్కరించాలని చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ రణధీర్ జైస్వాల్ ఇలా అన్నారు. ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేసేందుకు భారత్ దశాబ్దాలుగా నిరంతర కృషి అందిస్తోందన్నారు. సార్క్‌లో భారత్, అఫ్గానిస్థాన్, భూటాన్, బంగ్లాదేశ్, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక సభ్య దేశాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజిక, అభివృద్ధి సహకారాన్ని పెంచే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేస్తుంది. 2014లో నేపాల్ రాజధాని కాఠ్‌మాండూలో జరిగిన సార్క్ శిఖరాగ్ర సమావేశం తర్వాత ఈ సంస్థ కార్యకలాపాలు పెద్దగా ముందుకు సాగలేదు. 2016లో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన సార్క్ సదస్సు కూడా రద్దయింది. ఆ ఏడాది సెప్టెంబరులో జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో భారత సైనిక శిబిరంపై జరిగిన ఉగ్రదాడి అనంతరం భారత్ ఆ సమావేశానికి హాజరు కాలేమని ప్రకటించింది. తర్వాత బంగ్లాదేశ్, భూటాన్, అఫ్గానిస్థాన్ కూడా ఇస్లామాబాద్ సమావేశాన్ని బహిష్కరించడంతో సదస్సు పూర్తిగా రద్దయింది.

# ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు



కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు అని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అలాంటి వ్యక్తికి విద్యాశాఖ మంత్రి బాధ్యతలు కట్టబెట్టడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను ప్రహ్లాద్ జోషి వెనకేసుకొచ్చారని రాహుల్ తెలిపారు. అత్యాచార దోషులను సమర్థించే వ్యక్తి విద్యా శాఖ మంత్రిగా ఉండేందుకు ఎంత మాత్రం అర్హుడు కాదన్నారు.

"విద్యావ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తూ యువత ఆందోళనలు చేపట్టారు. ఎంతో మంది యువతులు నిరసనల్లో పాల్గొన్నారు. కానీ, వారిని దారుణంగా కొట్టారు, చిత్రహింసలకు గురిచేశారు. బీజేపీ ఒక అత్యాచార దోషుల రక్షకుడిని మంత్రి కుర్చీలో కూర్చోబెట్టింది. అత్యాచార దోషులకు రక్షణ కల్పించాలనే వాడి కంటే నైతికత లేని వ్యక్తి మరొకరు ఉండరు. ఇప్పుడు అతనే దేశ విద్యాశాఖ మంత్రి. ఈ విషయంలో ప్రధాని స్పందన చాలా వింతగా ఉంది. ఆయన కేబినెట్‌లో ఎంతో మంది మంత్రులు ఉన్నారు. వారిలో ఎవరికైనా ఈ పదవికి అప్పగించిఉండొచ్చు. కానీ ఆయన మాత్రం అత్యాచార దోషులను కాపాడే వ్యక్తినే ఎంచుకున్నారు."

ఇదిలా ఉండగా, పేపర్ లీక్, ఇతర అక్రమాలకు వ్యతిరేకంగా పరీక్షా విధానంలో తీసుకొచ్చిన కఠినమైన చట్టాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళల హక్కులు, మహిళా రిజర్వేషన్లు, మహిళా సాధికారత గురించి మాట్లాడుతుంటే, మరోవైపు ఇలాంటి వారిని మంత్రిని చేయడం సమాజంలో మహిళల భద్రతకు చాలా తప్పుడు సంకేతాలను పంపుతుందని ఆమె ఆరోపించారు. అయితే, లోక్?సభలో ప్రియాంక చేసిన వ్యాఖ్యలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ప్రహ్లాద్ జోషికి సంబంధించిన వీడియో తమ వద్ద ఉందని, తాను మాట్లాడిన ప్రతి మాటకూ కచ్చితమైన ఆధారాలు సమర్పిస్తానని ప్రియాంక స్పష్టం చేశారు.

**మన దేశ రాజ్యాంగం గొప్పది!**

అంతకుముందు, వేలాది మంది యువకులు తమ గళాన్ని వినిపించడానికి, ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం కోరడానికి శాంతియుతంగా వీధుల్లోకి వచ్చారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులు వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారని, కష్టపడటం కంటే నిజాయతీగా ఉండకపోవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఉందని భావించడం మొదలుపెట్టారని ఆమె ఆరోపించారు. "అన్నింటికన్నా మనకు ఈ దేశ రాజ్యాంగం గొప్పది, ప్రజాస్వామ్యమే సర్వోన్నతమైనది. దానిని నాశనం చేయడం పాపం. ఈ దేశంలోని కోట్లాది ప్రజలు మనల్ని కోరుకునేది ఒక్కటే, అదే జవాబుదారీతనం. మనకు అధికారం ఇచ్చి ఇక్కడికి వచ్చాక, మనం చేసే ప్రతి పని వారి సంక్షేమం కోసమే ఉండాలనేది వారి ఏకైక ఆకాంక్ష. ఒకవేళ వారికి అన్యాయం జరిగితే, మనం వారికి జవాబుదారీగా ఉండి, వారికి న్యాయం జరిగేలా చూడాలి. కానీ, అలా జరగనందువల్లే ఇటీవలి రోజుల్లో వేలాది మంది యువకులు వీధుల్లోకి వచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేశారు" అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.


## జనసంద్రమైన సింహాచలం..

ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది. కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

## ఫేస్‌బుక్, గూగుల్, ఎక్స్‌లకు కేంద్రం సమన్లు

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణ, వినియోగదారుల గోప్యత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్), గూగుల్, ఎక్స్, స్నాప్‌చాట్ వంటి దిగ్గజ సంస్థలకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమన్లు జారీ చేసింది. ఆగస్టు 3న నిర్వహించనున్న పార్లమెంటరీ కమిటీ సమావేశానికి హాజరై, సంబంధిత అంశాలపై వివరణ ఇవ్వాలని సోషల్ మీడియా ప్రతినిధులను ఆదేశించింది. కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సమావేశానికి టెక్ కంపెనీల ప్రతినిధులతో పాటు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మరియు హోం మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరై కమిటీకి వివరాలు సమర్పిస్తారని ఆయన తెలిపారు. ప్రజల, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, రైతుల సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి భరోసా కల్పిస్తున్నారో వివరించాలని కంపెనీలను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇటీవల పరీక్ష పత్రాల లీకేజీ, సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన వీడియోను ఫేస్‌బుక్ కొద్దిసేపు తొలగించడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సాంకేతిక లోపం వల్లే ఈ పొరపాటు జరిగిందని మెటా వివరణ ఇచ్చింది. ఈ వివాదం మరియు విద్యార్థుల నిరసనల నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంపై విస్తృత చర్చ జరుగుతున్న తరుణంలో పార్లమెంటరీ కమిటీ సమన్లు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కృత్రిమ సూర్యుడి దిశగా చైనా..



అపరిమితమైన, స్వచ్ఛమైన ఇంధనాన్ని సృష్టించే లక్ష్యంతో చేపట్టిన 'కృత్రిమ సూర్యుడు' ప్రాజెక్టులో చైనా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అణు సంలీన రియాక్టర్ కోసం రూపొందించిన ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ మాగ్నెట్‌ను చైనా శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. భవిష్యత్తులో ఫ్యూజన్ ఎనర్జీని సాధించే దిశగా ఇది అత్యంత కీలకమైన ఇంజినీరింగ్ విజయమని నిపుణులు అభివర్ణిస్తున్నారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ (ఏఎస్ఐపీపీ) శాస్త్రవేత్తలు ఈ ఘనత సాధించారు. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన టోరాయిడల్ ఫీల్డ్ మాగ్నెట్, హై-టెంపరేచర్ సూపర్ కండక్టింగ్ సెంట్రల్ సోలనోయిడ్ కాయిల్ వ్యవస్థలు అన్ని పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించినట్లు వారు ప్రకటించారు. సుమారు 582 టన్నుల బరువున్న ఈ భారీ మాగ్నెట్‌ను 'డీ' ఆకారంలో నిర్మించారు. దీని తయారీకి అవసరమైన కీలక పదార్థాల నుంచి సాంకేతిక పరిజ్ఞానం వరకు అన్నింటినీ చైనా దేశీయంగానే సమకూర్చుకోవడం విశేషం. అణు సంలీన ప్రక్రియలో భాగంగా, సూర్యుడి కేంద్ర భాగం కంటే కొన్ని రెట్లు అధిక ఉష్ణోగ్రత కలిగిన ప్లాస్మాను సృష్టిస్తారు. ఈ అత్యధిక ఉష్ణోగ్రత రియాక్టర్ గోడలను తాకకుండా, శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రంలో బంధించేందుకు ఈ భారీ మాగ్నెట్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. హైడ్రోజన్ ఐసోటోప్‌లను సంలీనం చేయడం ద్వారా శక్తిని ఉత్పత్తి చేసే ఈ విధానం, భవిష్యత్తులో కర్బన రహిత విద్యుత్ ఉత్పత్తికి మార్గం సుగమం చేస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైనప్పటికీ, వాణిజ్య స్థాయిలో ఫ్యూజన్ విద్యుత్‌ను నిరంతరాయంగా ఉత్పత్తి చేయడం అంతర్జాతీయ శాస్త్రవేత్తలకు ఇప్పటికీ సవాలుగానే ఉంది. అయితే, తన ఇంధన మరియు సాంకేతిక లక్ష్యాల సాధనలో భాగంగా చైనా ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ వేగంగా ముందుకు సాగుతోందని ఈ తాజా పరిణామం స్పష్టం చేస్తోంది.

## సైబర్ మోసాలకు పాల్పడితే మరణశిక్ష

ఆన్‌లైన్ మోసాలను (సైబర్ స్కామ్స్) అరికట్టే దిశగా మయన్మార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలను బలవంతంగా హింసించి, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా చేస్తున్న నేరగాళ్లకు మరణశిక్ష విధించేలా రూపొందించిన కొత్త చట్టానికి ఆమోదం తెలిపింది. రాజధాని నైప్యిడాలో జరిగిన పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో 'యాంటీ-ఆన్‌లైన్ స్కామ్ బిల్లు'కు ఆమోదం లభించినట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ నూతన చట్టం ప్రకారం, ఉద్యోగాల పేరుతో ప్రజలను కిడ్నాప్ చేసి, వేధింపులకు గురిచేస్తూ బలవంతంగా ఆన్‌లైన్ నేరాలకు పాల్పడేలా చేసే వారికి 10 ఏళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ ఈ క్రమంలో బాధితులు ఎవరైనా మరణిస్తే, బాధ్యులైన నిందితులకు మరణశిక్ష విధించేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. వీటితో పాటు స్కామ్ సెంటర్ల నిర్వాహకులకు, డిజిటల్ లేదా క్రిప్టోకరెన్సీ మోసాలకు పాల్పడే వారికి గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష పడేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. మయన్మార్‌లో నెలకొన్న అంతర్గత ఘర్షణలను ఆసరాగా చేసుకుని సైబర్ నేర కేంద్రాలు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. ఆగ్నేయాసియా అంతటా విస్తరించిన ఈ నెట్‌వర్క్, పెట్టుబడులు, హనీ ట్రాప్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతోంది. కొందరు స్వచ్ఛందంగానే ఈ ముఠాలలో చేరుతుండగా, మెజారిటీ విదేశీయులను ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో అక్రమంగా తరలించి, వారిని బందీలుగా మార్చి బలవంతంగా ఈ అరాచకాలకు ఒడిగడుతున్నారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఎంతోమంది యువత ఉద్యోగాల వేటలో మయన్మార్ వెళ్లి, అక్కడ స్కామ్ కేంద్రాల్లో బందీలుగా చిక్కుకున్నట్లు అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో, సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు ప్రస్తుత సైనిక మద్దతుగల ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కఠిన చట్టం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137